


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 251 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 31-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00



# తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి

## భారీగా తరలివచ్చిన ప్రముఖులు

- అర్ధరాత్రి నుంచే ప్రత్యేక దర్శనాలు
- మెగాస్టార్ చిరంజీవి ,సీఎం రేవంత్ రెడ్డి, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దర్శనం

**తిరుమల డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, -మిగతా 2 లో











## తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు

- క్రైమ్ రేటును బాగా తగ్గించగలిగాం
- పంచాయితీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం
- ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం
- మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం
- 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డిజిపి శివధర్ రెడ్డి

**హైదరాబాద్ డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం నాడు 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.
-మిగతా 2 లో

# ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

## ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు



- చెత్త, కాలుష్య నివారణ అతిపెద్ద టాస్క్
- చెత్త ఏరివేతకు వారినికి మూడ్రోజులు స్పెషల్ డ్రైవ్
- నాలాలు, చెరువుల ఆక్రమణలు కాకుండా చూడాలి
- జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు
- గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్‌కు మారాలి
- జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం

**హైదరాబాద్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమావేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.
మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ -మిగతా 2 లో



## బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

- కంచె వేయకుండా మోకాలడ్డిన బెంగాల్ సీఎం
- ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ కు అభివృద్ధి లేదు
- 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుంది
- తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతాం
- ఘాటు విమర్శలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్ షా

**కోల్‌కతా,**
భారత్ బంగ్లా సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి మమతా సర్కార్ అడ్డం పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోతోందని ఆరోపించారు. -మిగతా 2 లో



## బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా జియా మృతి

- అనారోగ్యంతో మృతి..పలువురి సంతాపం
- కొన్ని రోజులుగా అస్వస్థతో ఆస్పత్రిలో చికిత్స
- ఆమెకు న్యుమోనియా సోకినట్లు డాక్టర్లు నిర్ధరణ
- మంగళవారం ఉదయం 6 గంటలకు ఫజ్రు ప్రార్థనల తర్వాత ఆమె తుదిశ్వాస విడిచారు

**ఢాకా,**
బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ అధినేత్రి ఖలీదా జియా(80) కన్నుమూశారు. గుండె, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకడంతో నవంబర్ 23న ఢాకాలోని ఎవర్ కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు న్యుమోనియా సోకినట్లు డాక్టర్లు నిర్ధరించారు. ఆ తర్వాత వేగంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. గుండె, కిడ్నీ, లివర్, డయాబెటిస్, ఊపిరితిత్తులు తదితర ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యాయి. దీంతో మంగళవారం ఉదయం 6 గంటలకు ఫజ్రు ప్రార్థనల తర్వాత ఆమె తుదిశ్వాస విడిచారు.
ఖలీదా జియా బంగ్లాదేశ్ రాజకీయాలపై -మిగతా2 లో

## కేసీఆర్ అసెంబ్లీ చర్చకు వస్తారా?

- పాలమూరు-రంగారెడ్డిపై మాట్లాడుతారా
- రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఇదే చర్చ
- 2న తిరిగి ప్రారంభం కానున్న అసెంబ్లీ



**హైదరాబాద్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కెసిఆర్ తొలిరోజు అసెంబ్లీకి వచ్చారు. మళ్లీ వస్తారా అని అందరి అభిప్రాయంగా ఉంది. అసెంబ్లీలో ఆయన మాట్లాడితే చూడాలని కూడా చాలాంది అభిప్రాయంగా ఉంది. కెసిఆర్ మీడియా ముందుకన్నా, అసెంబ్లీలో తన వాణి వినిపించి ఆరోపణలకు సమాధానం చెప్పాలని కోరుకుంటున్నారు. 2న తిరిగి అసెంబ్లీ సమావేశం కానుంది. అయితే కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అంటూ గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో జరుగుతున్న వేళ, సోమవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. కేవలం కొద్దిసేపు మాత్రమే ఉండి
-మిగతా 2 లో

## 4వ అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్!

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 4.18 ట్రిలియన్ డాలర్ల జీడీపీని సాధించిన భారత్
- జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక శక్తి
- 2030 నాటికి జర్మనీని అధిగమించి 3వ అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

**న్యూఢిల్లీ**
స్థూల దేశీయోత్పత్తిలో(జీడీపీ) జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ అవతరించిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 4.18 ట్రిలియన్ డాలర్ల జీడీపీని సాధించిన భారత్ 2030 నాటికి జర్మనీని అధిగమించి తృతీయ ఆర్థిక శక్తిగా మారనున్నట్లు తెలిపింది.దృఢమైన దేశీయ వినియోగం, బలమైన నిర్మాణాత్మకమైన సంస్కరణలతో భారత్ అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధిని పరుగులెత్తిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.



-మిగతా 2 లో

## ప్రియాంక గాంధీ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు..

### స్నేహితురాలితో కుమారుడి ఎంగేజ్మెంట్

**న్యూఢిల్లీ డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ప్రియాంక, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. తన స్నేహితురాలు అవీవా బేగ్ తో రేహాన్ ఎంగేజ్మెంట్ జరిగినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. 25 ఏళ్ల రైహాన్ వాద్రాకు అవీవాతో ఏడేళ్లుగా పరిచయం ఉంది. వీరిద్దరూ మంచి స్నేహితులు. ఆ స్నేహం కాస్తా ప్రేమకు దారి తీసింది. -మిగతా 2 లో



## తెలంగాణ అసెంబ్లీ బీఆర్ఎస్ లీడర్ల నియామకం

- డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితా, తలసాని
- బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
- ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కేసీఆర్



**హైదరాబాద్ డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, -మిగతా 2 లో

## తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి

మొదటి తరువాయి

సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా ఆ గోవిందుడిని దర్శించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణేలిష్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

## బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

మొదటి తరువాయి



సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమి కొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా న్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని..రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

## బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా జియా మృతి

మొదటి తరువాయి

బలమైన ముద్ర వేశారు. ఆమె 1991 – 1996, 2001 – 2006 మధ్య పదేళ్లపాటు ప్రధానిగా పని చేశారు. బంగ్లాదేశ్‌లో కేర్ టేకర్ గవర్నమెంట్ వ్యవస్థను ఆమె తొలుత ప్రవేశపెట్టారు. అవినీతి కేసులో 2018 నుంచి 2020 వరకు జైల్లో గడిపారు. ఇటీవల ఆమె కుమారుడు తారిక్ రెహమాన్ 17 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టారు. మరో కుమారుడు అరాఫత్ రెహమాన్ కోకో కొన్నేళ్ల క్రితం మలేసియాలో కన్నుమూశారు. 1945లో వ్యాపారవేత్త సికందర్ కుటుంబంలో జన్మించిన ఖలీదాజియా.. 1960లో జియావుర్ రెహమాన్‌ను వివాహం చేసుకొన్నారు. బంగ్లా విమోచన యుద్ధంలో జియావుర్ పాక్‌పై తిరుగుబాటు చేసి యుద్ధంలో పాల్గొన్నారు. 1981లో ఆయన హత్య తర్వాత బీఎన్‌పీలో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. దీంతో ఖలిదా జియా పార్టీ పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత పదేళ్లకు తొలిసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.

## 4వ అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్!



మొదటి తరువాయి

2025–26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో భారత్ వాస్తవ జీడీపీ 8.2 శాతానికి విస్తరించిందని, మొదటి త్రైమాసికంలో ఇది 7.8 శాతం ఉండగా గత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 7.4 శాతం ఉందని పేర్కొంది. ప్రపంచ వాణిజ్య అస్థిరతలు ఉన్నప్పటికీ ఆరు త్రైమాసికాల్లో అత్యధిక జీడీపీని సాధించగలిగినట్లు ప్రభుత్వం తెలిపింది.

## ప్రియాంక గాంధీ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు..

మొదటి తరువాయి

ఈ క్రమంలో అవివా బేగ్‌కు రేహాన్ ప్రపోజ్ చేయగా.. ఆమె ఓకే చెప్పినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల అంగీకారంతో వీరిద్దరూ త్వరలో వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. వీరి ఎంగేజ్మెంట్ కూడా జరిపించినట్లు టాక్. అయితే, దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. అవీవా ఢిల్లీకి చెందిన అమ్మాయిగా తెలుస్తోంది.

# ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

మొదటి తరువాయి

జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశర చేశారు. క్యూర్ పరిధిలో సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా చేశాం. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం. జోనల్ కమిషనర్లు ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందే. జోన్ల వారీగా సమస్యలు పరిష్కరించే బాధ్యత కమిషనర్లదే అని స్పష్టం చేశారు. నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ. నెలకు 3 రోజులు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. నగరగంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు చేపట్టాలి. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో విద్యుత్ వాహనాలు తీసుకురావాలి. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నరెన్స్‌కు మారాలి. జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు చేపట్టాలి. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు బాధ్యత తీసుకోవాలని సిఎం రేవంత్ ఆదేశించారు. మంచి ఫలితాలు రాబట్టాలంటే ..జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. క్యూర్ పరిధిలోని



సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశంచేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశర చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ఎలాన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు

మొదటి తరువాయి

మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడం లో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్తా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా శిఖా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు



నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు.

# కేసీఆర్ అసెంబ్లీ చర్చకు వస్తారా?

మొదటి తరువాయి

వెళ్లిపోయారు. ఆయనకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సోమవారం ఎట్టకేలకు శాసనసభలో వచ్చి కూర్చున్నారు. సభలోకి వచ్చిన కొద్ది నిమిషాలకే బయటకు వెళ్లిపోయారు. అయితే, ఆయన చర్య గులాబీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహాన్ని నింపింది. వెంటనే ఇలా వచ్చి అలా వెళ్లిపోయిన కేసీఆర్ తిరిగి కొత్త సంవత్సరం రెండో రోజు నుంచి జరిగే సమావేశాలకు వస్తారా? లేదా? అనే కొత్త చర్చ రాజకీయ వర్గాల్లో, సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. కేసీఆర్ తప్పకుండా సభకు వస్తారని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై మాట్లాడతారని బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగా నమ్ముతున్నాయి. ఎందుకంటే కెసిఆర్ వస్తారని, మాట్లాడుతారని గతకొంత కాలంగా హరీష్ రావు, కెటిఆర్ఉ చెబుతూ వచ్చారు. సోమవారం కేసీఆర్ శాసనసభకు రావడం ఖరారు కావడంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉదయమే పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు స్వాగతం పలికేందుకు వేచి ఉన్నారు. దాంతో అక్కడంతా హడావుడి కనిపించింది. బీఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఆయన మొదట అసెంబ్లీ లాబీలో తనకు కేటాయించిన ప్రతిపక్ష నేత ఛాంబర్‌లోకి వెళ్లారు. అక్కడే సభకు సంబంధించిన హాజరు నమోదు పత్రంలో సంతకం చేశారు. తర్వాత అసెంబ్లీ హాల్లోకి వెళ్లి కూర్చున్నారు. కొద్ది నిమిషాల్లోనే తన నివాసానికి బయలుదేరి వెళ్లారు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై చర్చ జరుపుదామని, కేసీఆర్ సభకు రావాలంటూ ఈ మధ్యకాలంలో అధికార పార్టీ నేతలు సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనవరి రెండు లేదా మూడో తేదీన కేసీఆర్ శాసనసభకు వస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో చర్చించే అంశాలపై స్పష్టత వచ్చాక, చర్చించే అంశాలను బట్టి కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా, గత ప్రభుత్వాల ప్రతిపాదనలు, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తీసుకున్న నిర్ణయాలపై కేసీఆర్ మాట్లాడతారని సమాచారం. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరి వల్ల రెండు జిల్లాల రైతులకు ఎలాంటి నష్టం జరగనుందో కేసీఆర్ ప్రస్తావిస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఇదే అంశంపై క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసి, ప్రజల్లోకి వెళ్తారని అంటున్నారు. రెండు అంశాలపై అసెంబ్లీ వేదికగా ఏం చెప్పాలి? ఇప్పటివరకు ఎదురైన ఇబ్బందులు, భవిష్యత్‌లో ఏర్పడే ప్రమాదాలు వంటి వాటిపై కేసీఆర్ సంబంధిత నిపుణులతో చర్చలు జరుపుతూ సన్నద్ధం అవుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే విపక్షనేతగా ఈ రెండేళ్ల కాలంలో అసెంబ్లీలో కెసిఆర్ ఎక్కడా కనిపించలేదు. కేవలం సంతకం పెట్టి వెళ్లిపోయారు. కనీసం ఇప్పుడైనా రాకుటే ఇక బిఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం కూడా కానరాదు.

# తెలంగాణ అసెంబ్లీ బీఆర్ఎస్ లీడర్ల నియామకం

మొదటి తరువాయి

సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారీని బీఆర్ఎస్ ఎ÷–లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారీని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

# టిటియు జిల్లా అధ్యక్షుడిగా కుల్ల రాజేందర్



**పెద్దపల్లి, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ టీచర్స్ యూనియన్ (టిటియు) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ముత్తారం మండలం పోతారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కుల్ల రాజేందర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పొలంపల్లి ఆదర్శన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కుల్ల రాజేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని, ప్రభుత్వానికి ఉపాధ్యాయుల గళాన్ని బలంగా వినిపించేలా సంఘాన్ని ముందుకు నడిపిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం టిటియు కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



**గంగాధర, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ (పత్తి కుంటపల్లి) శ్రీ కోదండరామచంద్రస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వార దర్శనం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి తరలివచ్చి పల్లకి సేవ, భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ, అర్చకులు, సేవకులు సమన్వయంతో నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.

# బిఆర్ఎస్‌లోకి చేరిన కనకుంట్ల శ్రీనివాస రెడ్డి




**గంగాధర, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం బూరుగుపల్లి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మధురనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు కనకుంట్ల శ్రీనివాస రెడ్డి సింగపూర్ శీనన్న తిరిగి బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమం బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్ రావు ఆధ్వర్యంలో జరిగింది. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గులాబీ కండువా కప్పి శ్రీనివాస రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతంగా ఉందని, కార్యకర్తలంతా ఐకమత్యంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీలో చేరికల పరంపర కొనసాగుతుందని అన్నారు. బిఆర్ఎస్‌లో చేరిన శ్రీనివాస రెడ్డిని ఆయన అభినందించారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం



**గంగాధర, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రజిత, ఎంపీడీఓ దమ్మని రాము, సర్పంచ్ వేముల భాస్కర్, ఐకేపీ ఏపీఎం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, పోలీస్ సిబ్బంది, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రటరీ, హాస్టల్ వార్డెన్‌తో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్, వినయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన అధికారులు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని తనం నిర్మూలించబడిందని, సమాజంలో ప్రతి పౌరుడు సమానమని గుర్తుచేశారు. స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో కలసి మెలసి జీవించాలని, చట్టాల పట్ల అవగాహన పెంచుకొని తగిన విధంగా ప్రవర్తించాలని సూచించారు. హోటళ్లలో రెండు గ్లాసుల విధానం, దేవాలయ ప్రవేశంలో వివక్ష వంటి చర్యలు చట్టరీత్యా శిక్షార్హమని, అలాంటి ప్రవర్తనకు తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు.

# శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు విద్యుత్ సౌకర్యం కోసం వినతి





**పాలకుర్తి, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో జరగనున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులతో కలిసి బసంతనగర్ ఏఈ మానాల ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ నూతన పాలకవర్గం ఏఈ ప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానం చేసి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. జనవరి 26 నుండి 30 వరకు జరగనున్న జాతరలో తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా దేవస్థానం వద్ద 25 కేవీ సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తే 24 గంటలూ భక్తులకు సౌకర్యం ఉంటుందని సర్పంచ్ తెలిపారు. దేవస్థానంలో విద్యుత్ వెలుగులు లేకపోవడం వల్ల రాత్రివేళల్లో దొంగలు హుండీలు పగులగొట్టి దొంగతనాలు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఈ మానాల ప్రసాద్ స్పందిస్తూ, విద్యుత్ సరఫరా ఏర్పాటుకు వెంటనే ప్రణాళిక సిద్ధం చేసి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పులి సంచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు



**కరీంనగర్ రూరల్ మండలం, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లాలోని బహదూరా న్ పేటలో పులి సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మొక్కజొన్న చేనులో పులి సంచరిస్తున్నట్లు గుర్తించిన ఓ మహిళ సమాచారం ఇవ్వడంతో అధికారులు అక్కడికి చేరుకుని అడుగుల గుర్తులను పరిశీలించారు. గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా పనులకు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచించారు.

# సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఘన సన్మానం



**అచ్చంపేట, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని నేషనల్ హోటల్‌లో మాదిగ, ఉపకులాల సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, మున్సిపల్ కౌన్సిలర్ శివకృష్ణ, ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ మాదిగలు పార్టీలకు అతీతంగా ఐక్యతతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో కూడా పోటీ చేసి విజయాలు సాధించాలని సూచించారు. వీరాం రామాజిపల్లి, పోలేపల్లి గ్రామాల్లో సర్పంచులుగా గెలుపొందిన పానుగంటి మనోహర్, ఎల్లస్వామి జాతికి గౌరవం తీసుకువచ్చారని నాయకులు అభినందించారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మత్తు కారక్రమంలో పాల్గొన్నా బీజేపీ నేతలు



**కొత్తపేట, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ కాలనీలో రోడ్ల మరమ్మత్తు కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వగ్గుల సుందర్ నారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వగ్గుల శివ నారాయణ, విక్రమ్ సింగ్, రూపేష్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు. రోడ్ల సమస్యలు పరిష్కారమవుతాయని కాలనీవాసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వైకుంఠ ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు



**పెద్దపల్లి, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ వేంకటేశ్వర పుణ్యక్షేత్రంలో వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే ఉత్తర ద్వారం వద్ద భక్తులు బారులు తీరుతూ గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారికి తులసి దళాలు సమర్పిస్తూ, దీపాలు వెలిగిస్తూ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు సంపత్ కుమార్ చార్యులు మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనం వైష్ణవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదని, ఈ దర్శనం ద్వారా మోక్షప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం అని తెలిపారు. సాధారణంగా వైకుంఠ ఏకాదశి రోజున ఈ దర్శనం నిర్వహించబడుతుందని, ఆ రోజున ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. భక్తులు ఉపవాసంతో, భక్తిశ్రద్ధలతో విష్ణుమూర్తిని దర్శించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతారని, వైకుంఠ ద్వార దర్శనం మనసుకు శాంతి, జీవనానికి సత్పథాన్ని ప్రసాదిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం విజయ్ చార్యులు, అర్చకులు, సేవకులు, పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్ఓ



**హుస్నాబాద్ నియోజకవర్గం, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ చందు, పిఓ ఎన్సిడి డాక్టర్ ఉమాశ్రీ కలిసి సైదాపూర్, కేశపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. హాజరు రిజిస్టర్, అవుట్‌పేషెంట్ రికార్డులు, ఎన్‌సిడి క్లినిక్‌లో అసంక్రామిత వ్యాధిగ్రస్తుల వివరాలు, మందుల పంపిణీ విధానం, ఫార్మసీ స్టోర్లలో సీజనల్ మందుల నిల్వలు, పిల్లల టీకాల కోసం ఐఎల్ఆర్‌లో టెంపరేచర్ రికార్డులు, ఐఇసి బోర్డులో ప్రదర్శించిన వివరాలను పరిశీలించారు.ప్రసూతి గది పరిశుభ్రత, అత్యవసర మందుల లభ్యతను తనిఖీ చేసి, పీహెచ్సీలలో నార్మల్ డెలివరీలను పెంచాలని సూచించారు. అవుట్‌పేషెంట్లను పలకరిస్తూ వారికి అందుతున్న వైద్య సేవలపై సమాచారం సేకరించారు.ఈ కార్యక్రమంలో సైదాపూర్ పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ మీనాక్షి, కేశపట్నం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్‌తో పాటు సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలు





**పాలకుర్తి, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం ఈశాల తక్కళ్లపల్లి గ్రామంలో జనవరి 26 నుండి 30 వరకు జరగనున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఏఎంసి చైర్మన్ గాలిపెల్లి తిరుపతి, గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ శశికళ, ఏఈ రుషికేష్ జాతర ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గాలిపెల్లి తిరుపతి మాట్లాడుతూ జాతర ఏర్పాట్లకు ఎమ్మెల్యే 20 లక్షల నిధులు మంజూరు చేశారని, అవసరమైతే మరో 10 లక్షలు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారభక్తుల సౌకర్యార్థం ప్రాంగణంలో పిచ్చి చెట్ల తొలగింపు, చదును పనులు, దేవస్థానం చుట్టూ ఇనుప కంచెలు, త్రాగునీరు, విద్యుత్, స్నానఘట్టాలు, జంపన్నవాగు, టాయిలెట్స్, శానిటేషన్ వంటి ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించారు. లక్షకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకోనున్నందున అన్ని సౌకర్యాలు సమకూర్చాలని అధికారులు సూచించారు.కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ తోట స్వప్న మహేష్, రామారావుపల్లి సర్పంచ్ అన్నం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ ఎర్రం స్వామి, మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# గరుడాద్రి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

-ఎమ్మెల్యే బాలు నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు దేవరకొండ పట్టణంలోని శ్రీగరుడాద్రి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని ఎమ్మెల్యే బాలు నాయక్ సందర్శించి,స్వామి వారిని దర్శించుకొని వేద పండితుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే దేవరకొండ ప్రాంత ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ముక్కోటి దేవతలతో కలిసి ఉత్తర ద్వార దర్శనమిచ్చే శ్రీమహావిష్ణువు దివ్యానుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఇంట సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ అల్లంపల్లి నర్సింహా, ప్రధాన కార్యదర్శి దొడ్డి అశోక్, కోశాదికారి సిరందాస్ కృష్ణయ్య, పట్టణ మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, నాయకులు డాక్టర్ వేణుధర్ రెడ్డి, పున్నబోయిన సైదులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్

-15 వార్డుల్లో విజయంతో అభివృద్ధి పనులు మరింత వేగం
- ఐఎన్టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్



**ఆమనగల్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత మున్సిపల్ పాలకవర్గ కాలంలో ఆమనగల్ మున్సిపాలిటీ ప్రజలు కోరుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఐఎన్టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్ విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందన లేకపోవడంతో మౌలిక వసతుల లోపాలు తీవ్రతరమయ్యాయని గుర్తుచేశారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల సహకారంతో ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి అభివృద్ధి చర్యలకు గట్టి పునాది వేస్తామని ఆయన హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమనగల్‌లో పలు కీలక ప్రాజెక్టులు పురోగమిస్తున్నాయని ఆయన వివరించారు. వాటిలో ఆమనగల్ మున్సిపాలిటీ గవర్నమెంట్ హాస్పిటల్‌కు కొత్త భవనం, ఆమనగల్ చౌరస్తా నుండి తలకొండపల్లి -మాడుగుల రహదారి విస్తరణ, బీసీ హాస్టల్ కొత్త భవనం, వాటర్ ట్యాంకుల నిర్మాణం, ఓపెన్ జిమ్‌లు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి కార్యక్రమాలు ముఖ్యమన్నారు.అభివృద్ధి ప్రయాణం ఇక్కడితో ఆగదని, ఇంకా అనేక పనులు ప్రణాళిక దశలో ఉండగా వాటిని కూడా త్వరలో అమలు చేస్తామని తెలిపారు.“ప్రజా ఆశయాలే కాంగ్రెస్ ప్రాణం గెలుపు మీ చేతుల్లో ఉంది. అవకాశం ఇస్తే ఆమనగల్ ప్రతి వార్డును ఆదర్శ మున్సిపల్ వార్డుగా తీర్చిదిద్దుతాం” అని ఐఎన్టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్ చెప్పారు.

# దేవరకొండలో కిడ్జీ & మౌంట్ లిటెరా జీ స్కూల్‌లో కరాటే గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమం




**దేవరకొండ,డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కిడ్జీ మరియు మౌంట్ లిటెరా జీ స్కూల్, దేవరకొండలో కరాటే గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులు కూడా పాల్గొని వివిధ స్థాయిల కరాటే బెల్టులను విజయవంతంగా సాధించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి హాజరై, విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ బెల్టులను అందజేశారు. ఆయన విద్యార్థులను అభినందిస్తూ, కరాటే విద్య స్వీయ రక్షణకు, ఆత్మవిశ్వాసానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.
కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ శ్రీధర్ స్వాగత ప్రసంగం చేయగా, నాయక్ మార్షల్ ఆర్ట్ కరాటే అకాడమీ, దేవరకొండకు చెందిన గోపీ నాయక్ కార్యక్రమ పరిచయాన్ని అందించారు. కరాటే శిక్షణ మరియు గ్రేడింగ్ పరీక్షల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అష్రఫ్ అచ్చరాత్ మాట్లాడుతూ, కరాటే అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా, మానసిక ధైర్యం, ఆత్మనియంత్రణ, క్రమశిక్షణ, ధైర్యసాహసం, ఇతరుల పట్ల శ్రద్ధ వంటి విలువలను పెంపొందిస్తుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయక్ కరాటే అకాడమీ బృందం నిర్వహించిన ప్రత్యేక కరాటే ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం మరియు శారీరక-మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేలా నిలిచింది.

# విజయవంతంగా రిపబ్లికన్ పార్టీ సదస్సు




**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర కార్యాలయంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సామాజిక న్యాయం, ప్రజా, కార్మిక సమస్యలపై సదస్సు జరిగింది. అధ్యక్షుడు కాశిపాక అజయ్ అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగంలో ఉన్న హక్కులు కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, ప్రస్తుతం అది అమలులో లేదని అన్నారు. రాష్ట్రంలో బిజెపి, టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజల సమస్యలను పక్కన పెట్టి తమ ఉనికికోసమే రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. రిపబ్లికన్ పార్టీ ప్రజల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడుతుందని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులు అయినా నిరుపేదలకు ఎలాంటి సామాజిక భద్రత అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి పార్టీని ఓడించాలని, రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించాలంటే ఆర్‌పిఐ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సదస్సులో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, మంచిర్యాల మహిళా విభాగం అధ్యక్షురాలు జగదంబుల లలిత, తడిగొప్పుల వినోద్ కుమార్, సిహెచ్ లలిత, సట్ల రాజేశ్వరి, రేష్మి, సల్మాన్ సుల్తాన్ సైనథ్ తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**కల్వకుర్తి, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్‌లో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, వై. కృష్ణారెడ్డి, వై. కిషోర్ రెడ్డి, ఉప్పు ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ చైర్మన్ కల్వ మనోహర్, కల్వ రమేష్ ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల సందోహంతో ఆలయం కిటకిటలాడగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింతగా అలంకరించాయి.

## మిట్ట మధ్యాహ్నం

# వెలిగిన వీధి దీపాలు




**మనోహరాబాద్, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో మిట్ట మధ్యాహ్నం సమయంలోనే వీధి దీపాలు వెలుగుతున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా రాత్రి వేళల్లో మాత్రమే వెలగాల్సిన వీధి దీపాలు పగటి పూట కూడా వెలగడం చూసి గ్రామ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.మనోహరాబాద్ పెద్ద గ్రామపంచాయతీ కావడంతో కరెంట్ బిల్లులు లక్షల రూపాయల్లో ఉంటున్నాయని స్థానికులు తెలిపారు. ఈ పరిస్థితిలో రోజంతా వీధి దీపాలు వెలిగితే గ్రామపంచాయతీ నిధులు వృథా అవుతున్నట్టేనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాల నిర్వహణలో ఉన్న లోపాలను సరిదిద్దాలని, అనవసర విద్యుత్ వ్యయాన్ని నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# చెప్పుల దుకాణంలో అగ్నిప్రమాదం





**తూప్రాన్, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తూప్రాన్ మున్సిపల్ పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్ సమీపంలో మంగళవారం ఒక చెప్పుల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి దుకాణమంతా కమ్మేసి, అందులో ఉన్న చెప్పులు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది.సమాచారం అందగానే బీజేపీ తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షుడు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ ఘటన స్థలికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. దుకాణదారులను పరామర్శించి ధైర్యం చెప్పి, తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ అధికారులతో మాట్లాడి బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని భరోసా కల్పించారు.

# కృష్ణపట్టి లోసారాయి స్థావరాలపై ఎక్సైజ్ శాఖ దాడి





**దేవరకొండ డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్గొండ జిల్లాలోని దేవరకొండ స్టేషన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం నూతన సంవత్సరం మరియు డిసెంబర్ 31 దృష్టిలో ఉంచుకొని అంతర్ రాష్ట్ర సరిహద్దులలో కృష్ణపట్టి ప్రాంతం లో , ఆంధ్రప్రదేశ్ ఎన్ఫోర్స్మెంట్ టీం, టాస్కోర్స్ టీం, నరసరావుపేట టీం మరియు మాచర్ల స్టేషన్ టీం లతో నల్గొండ జిల్లాలో దేవరకొండ స్టేషన్ టీం, టాస్కోర్స్ టీం, ఎన్ఫోర్స్మెంట్ టీం అన్ని బృందాలు కలిసి చందంపేట మండలంలోని కృష్ణపట్టే ప్రాంతంలో నాటు సారాయి మరియు బెల్లం అమ్మకాలపై విస్తృత తనిఖీలు చేసినారు .ఇట్టి దాడుల్లో 200 లీటర్ల బల్లెం పానకం ధ్వంసం చేయడం జరిగింది నాటు సారాయిపై మరియు బెల్లం రవాణా మరియు అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంటుందని ఈ టీములన్ని నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉంటాయని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా నాటు సారాయి తయారీ, నల్ల బెల్లం రవాణా మరియు అమ్మకాలపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు . ఏదైనా సమాచారం ఉంటే సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలుపగలరని తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ



**దేవరకొండ డిసెంబర్ 30. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మండలం కోర్ర తండా గ్రామపంచాయతీ కోర్ర సూర ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో భూమి పూజ నిర్వహించిన కోర్రతండ గ్రామపంచాయతీ సర్పంచ్ రాత్లవత్ రాజేందర్, జనసేన పార్టీ ఇంచార్జ్ సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోర్ర చందు నాయక్, కొరతండ గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోర్ర శంకర్ నాయక్.ఇల్లు లేని పేదలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి పేదలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోర్ర తండా గ్రామపంచాయతీ సెక్రటరీ కవిత, కోర్ర సేవు, కోర్ర సూర, నేనావత్ రాము, కోర్ర తండా గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి

## కిటకిటలాడిన ఆలయాలు



**జాఫర్ గడ్ , డిసెంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ముక్కోటి ఏకాదశి సందర్భంగా జాఫర్ గడ్ మండలంలో ఉన్న దేవాలయం లో భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు – ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉత్తరద్వార దర్శనాలతో మార్మోగిన దేవస్థానాలు . జాఫర్ గడ్ వైకుంఠ ద్వార దర్శనాలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామివారికి శాస్త్రోక్తంగా పూజ కైంకర్యాలతోపాటు అభిషేకం నిర్వహించారు . రామాలయంలో ఉత్తర ద్వారం ద్వారా రేవూరి రమేష్ గుప్త స్వామి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# పల్లెపాలనలో మహిళలకు స్వేచ్ఛనివ్వండి







గ్రామపంచాయతీలకు సర్పంచ్ నియామకాలు జరిగిపోయాయి.డిసెంబర్ 22న అధికారికంగా ప్రమాణస్వీకారాలు చేసి గ్రామనూతనపాలకుల కొలువుదీరారు.1992లో 73వ రాజ్యాంగ సవరణ,ఆర్టికల్ 243డి ప్రకారం స్థానికసంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించగా,దానిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్నివిభాగాల్లో మహిళా రిజర్వేషన్ 50శాతానికి పెంచి అమలుచేస్తున్నారు.దీనివల్ల సగంమంది మహిళలు గ్రామపంచాయతీలకు నాయకత్వం వహిస్తున్నారు.అందులోభాగంగా తెలంగాణలో మొన్నజరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో 6వేలకుపైగా మహిళలు సర్పంచ్ లుగా ఎన్నికయ్యారు.అందులో జనరల్ స్థానాలలో 2446,బీసీ మహిళల స్థానాలు 942,ఎస్సీ మహిళల స్థానాలు 908,ఎస్టీ మహిళలు 1434 స్థానాలు పొందగా,అందులో అత్యధికంగా నల్గొండజిల్లాలో 404 మహిళా సర్పంచ్ స్థానాలుండడం గమనార్హం. పూర్వం ఆడవారంటే వంటింటికే పరిమితం,వారిపై చులకన భావన ఉండేది.అలాగే ఆడశిశువులను కనడానికి,చదివించడానికి శ్రద్ధ వహించేవారుకదు.అలాంటి వివక్షత నుండి కాలక్రమేణా వచ్చిన మార్పులవలన నేడు మహిళలు అన్నిరంగాలలో పురుషులతో సమానంగా అవకాశాలు పొందుతున్నప్పటికి ఇంకా అక్కడక్కడా కొంత వివక్షతకు గురవుతున్నారనడంలో నిజంలేకపోలేదు. ఆనాడు భారతీయ మెదటి మహిళా అధ్యాపకురాలుగా పేరుగాంచిన సావిత్రిబాయి పూలే మొదలుకొని,నేటి వాస్తవిక సమాజంలో ఎందరో మహామణుల కృషిఫలితంగా నేడు వారికంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకోవడమే గాకుండా "మాకెవరు సాటి – మాకు మేమే సాటి" అనేలా మగవారుచేసే ప్రతి పనినిచేస్తూ నిరూపిస్తున్న తరుణం,ఒక్కరంగంలో గాకుండా ప్రతిరంగంలోకి ప్రవేశించి మహిళసత్తా అంటే ఏంటోనని పలువురికి ఆదర్శముగా నిలుస్తున్న ఆదర్శమహిళలెందరో ఉన్నారు.అలాగే సాహిత్యరంగంలో సైతం ఎందరోమహిళలు ఎన్నోరచనలు చేస్తూ దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.అందులోభాగంగా ఎన్నో అవార్డులు,రివార్డులు అందుకుంటున్న దాఖలాలున్నాయి.ఇవియేగాకుండా విభిన్నరంగాలలో మహిళామణులు తమకంటూ ఒకస్థానాన్ని ఏర్పరచుకొని మేముసైతం అనిచెప్పే సందర్భంలో ప్రస్తుత మహిళలోకమున్నది. ప్రత్యేకంగా పాలకవర్గంలో మహిళమూర్తులు ఆదర్శవంతమైన పాలనగావించి తమ ధైర్యసాహసాలను చెప్పకనే చెప్పడం జరిగింది.అలాంటి సందర్భంలో గ్రామీణప్రాంతాలలో దానికివిరుద్ధంగా జరుగుతుందని చెప్పడంలో ఎలాంటి అబద్ధంలేదు.స్థానికఎన్నికలలో రిజర్వేషన్ల కారణంగా ఎన్నికైన మహిళా వార్డుమెంబర్లు,సర్పంచులు,రాజకీయనాయకులు అవకాశం రాకపోవడంతో వారిభార్యలను,తల్లులను ఎన్నికలబరిలో దిగబెట్టి,ఆయాస్థానాలను చేజిక్కించుకోవడం జరిగింది.కానీ వారిని కేవలం సంతకాలకే పరిమితంచేసి,వారిస్థానాలలో భార్యచాటు భర్తలా అధికారాలను చెలాయించడం జరుగుతుందంటే మహిళలకు మగవారిచ్చే గౌరవం ఏపాటిదో తెలియకనే తెలుస్తుంది.కార్యాలయాలలో ఎన్నికకాబడిన మహిళామణులున్నా కూడా ఏదైనా అవసరనిమిత్తం వెళ్ళితే,ముందుగా వారిభర్తను లేదా కుమారుడిని కలిసి విషయంచెప్పి అనుమతి తీసుకుంటేగానీ పనికానీ పరిస్థితి దాపురించిందంటే అతిశయోక్తిలేదు.బయటిప్రపంచానికి మగవారికి సమానంగా గౌరవిస్తున్నట్లు చట్టాలు చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో చేసేపని దేనికిసూచియో అర్థంకానీ పరిస్థితి. ఎందరో ఆదర్శమహిళలు పోరాడి,రాజ్యాంగపరంగా వారికంటూ స్థానాలుండాలని పోరాడితే ఇలాంటి అవకాశాలు పొందడం జరిగింది.గానీ చివరికి అధికార చెలాయింపు,నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ వారికీ లేకపోవడమనేది బాధాకరం.ప్రస్తుత సమాజంలో చాలా కుటుంబాలు సుఖసంతోషాలతో ఉన్నదంటే కారణం ఆ కుటుంబబాధ్యతలను మహిళామణులు లేదా భార్యభర్తలిద్దరు కలిసి చూసుకోవడమనేది నగ్నసత్యం.అలాంటి తరుణంలో పూర్తిగా నిర్ణయబాధ్యతలు వారికేఇస్తే గ్రామాన్నిసైతం బాగుపరుస్తారు . . కదా ! ఎందుకీ ఈ ఆడచాటు మగపెత్తనం ?అనే అనుమానం కలగకమానదు. అంటే రాజ్యాంగపరంగా వారికంటూ అవకాశాలిస్తూ,వాటిని మగవారు చేతులోకి తీసుకోవడం సరైన పద్ధతేనా ?ప్రభుత్వాలు వీటిపై దృష్టి కేంద్రీకరించి సరైనచర్యలు తీసుకోని,వారికీ ప్రత్యేకశిక్షణలిస్తూ,స్వతహాగా నిర్ణయం తీసుకునేలా,వారితరుపున మగపెత్తనం లేకుండేవిదంగా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా వున్నది.ఇలా చేయనియెడల స్థానికసంస్థలలో ఆడవారికి ప్రత్యేక రిజర్వేషన్స్ వలన ఎలాంటి ఫలితంలేదని గ్రహించాలి.కావున ఎన్నికలలో గెలిచిన మహిళలకు పూర్తిగా స్వేచ్ఛ ఉండేలా,వారిపై వారి కుటుంబసభ్యుల నియంత్రణ లేకుండేలా,కార్యాలయాలలో ఆడచాటు మగపెత్తనం ఉండకుండా చర్యలు తీసుకుంటూ మహిళలకు వచ్చిన రిజర్వేషన్స్ ను గౌరవిస్తూ,సహకరించే విదంగా ప్రభుత్వాలు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. "ఇంటికి దీపం ఇల్లాలు" అంటారు. ప్రస్తుతం అధికశాతం కుటుంబాలలో మహిళల నిర్ణయాలే శిరోధార్యం,అలాంటి కుటుంబాలే అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాయనడం సైతం జగమెరిగిన సత్యం.వారికి పూర్తి స్వేచ్ఛనిస్తే రుజువుచేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.అంతెందుకు దేశానికి ఇందిరాగాంధీ ప్రధానిగా పగ్గాలుచేపట్టి,ఒక మహిళాశక్తి ఏంటో నిరూపించలేదా? ప్రతిభాపాటిల్ దేశప్రథమ పౌరురాలు (రాష్ట్రపతి)గా విధులు నిర్వహిస్తే, ప్రస్తుతం ద్రౌపదిముర్ము విధులు నిర్వహించడంలేదా ?గతంలో సుష్మాస్వరాజ్ ప్రధాన ప్రతిపక్షనేతగా పనిచేయలేదా? నిర్మలా సీతారామన్ ప్రస్తుత దేశఆర్థికమంత్రిగా సేవలందించడం లేదా ? గత మూడుపర్యాలుగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ కొనసాగుతుండగా,గతంలో సుచేతా కృపాలాని,షీలాదీక్షిత్,మాయావతి,జయలలిత,వసుంధర రాజే,ఉమాభారతి,రబ్రీదేవి,ఆనందిబెన్ పటేల్ ఇలా మహిళామణులెందరో వివిధరాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా,మంత్రులుగా,కేంద్ర మంత్రులుగా సేవలు చేయలేదా? చేస్తలేరా?అంతెందుకు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సైతం సీతక్క మరియు కొండా సురేఖ మంత్రులుగా విధులు నిర్వహించడం జరుగుతుంది.అలాగే విభిన్నరంగాలలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ అగ్రస్థానాలకు చేరుకున్న వారెందరో ఉన్నారు.ప్రస్తుత రాజకీయాలపట్ల మహిళామణులు దృష్టిసారించి,స్వతహాగా నిర్ణయాలు తీసుకుంటూ పాలకరంగంలో రాణించినమాట వాస్తవంగాదా !కానీ గ్రామాలలోకి వచ్చేసరికి ఎక్కువశాతం వారినీ స్వంత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇవ్వకపోవడమనేది దేనికినిదర్శనమో అంతుపట్టనిప్రశ్నగా మిగిలిపోతుంది.పుట్టుకతోనే ఎవరు అన్నీ నేర్చుకోరు,క్రమంగా అర్థమవుతుంటాయి,వారికీ ఆ స్వేచ్ఛనిస్తే రాణిస్తారనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు.రాజ్యాంగం పరంగా ఎవరి హక్కులను కాలరాయకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతిఒక్కరిపై ఉన్నది.ఇకనైనా మార్పు రావాలని ఆశిద్దాం.

**వ్యాసకర్త**
డా.పోలం సైదులు,
తిరుమలగిరి,వంగూర్,మండలం,
9441930361.



## వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నా ఎమ్మెల్యే

**వరంగల్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా వైకుంఠ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, నియోజకవర్గ అభివృద్ధి, సమగ్ర సంక్షేమం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.



# వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఘనంగా పూజలు



**కరీంనగర్ రూరల్ , డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వైకుంఠ ఏకాదశి సందర్భంగా కరీంనగర్ నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని పూలతో సుందరంగా అలకరించి, దీపాకాంతుల్లో వెలిగిపోతూ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, ప్రధాన అర్చకుడు పవన్‌కృష్ణ శర్మ విశేష అభిషేకాలు, హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వంగళ లక్ష్మన్, వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, మాజీ కార్పొరేటర్ వంగళ శ్రీదేవి తోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమాల రథసారథి

**- ఎస్ఎఫ్ఐ**



**దేవరకొండ డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ )దేవరకొండ డివిజన్ కమిటీ యూనిట్,కమిటీల ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యకులు బుడిగ వెంకటేష్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం ,సోషలిజం ఆశయాల పతాకాన్ని ఎగురవేశారుఅనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యా రంగం సమస్యలపై దేశ ,రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించి మా దేహం ముక్కలైన ఈదేశాన్ని ముక్కలు కానివ్వం అంటూ నిజమైన దేశ భక్తి గల విద్యార్థి సంఘం గా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిలిచిందనిఅన్నారు.ఈదేశంలో రాష్ట్రంలో పేద మధ్యతరగతి బడుగు బలహిన వర్గాల విద్యార్థుల చదువుల కోసం నికరంగా నిలబడి ఎన్ని నిర్బంధాలు ఎదురైనా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలోకి మతోన్మాద కషాయికరణం,వైపు అడుగులు వేస్తూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా రంగంలోకి మనువాద భావజాలం జోప్పించి చరిత్రలను వక్రీకరిస్తూ జన్మిస్తాయిలు కూడా త్యాగం చేయని వాళ్ళని డీల్లీ స్థాయిలో ప్రచారాలు చేస్తూ బిజెపి ఇతర రాష్ట్రాలలో బలవంతంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని రుద్దడం కోసం బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుందని దానికి వ్యతిరేకంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ అనేక ఆందోళనలకు పూనుకుంటుందని హెచ్చరించారు. నరేంద్ర మోడీ దేశంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ ను పక్కదారి పట్టిస్తూ వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ బడుగు బలహీన వర్గాలకు విద్యను అందరిని ద్రాక్షల మారుస్తున్నారన్నారు.ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ స్కూల్స్ బచావో మోడీ హటావో అనే నినాదాన్ని విద్యార్థులకు తీసుకెళ్తుందని ఈ సందర్భంగా అన్నారు.ప్రభుత్వ పాఠశాలలను మూసివేసిన జిల్లాలో దేశంలోని నల్గొండ మొదటి స్థానంలో ఉందంటే విద్యారంగం పైన బిజెపి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని అన్నారు.ఈ సందర్భంగా విద్యారంగ సమస్యల పరిష్కారంలో అసువులు వాసన విద్యార్థి అమరవీరుల త్యాగాలను నెమరువెసుకుంటు మరింత విద్యార్థి ఉద్యమాలను బలమైన పోరాటాలు నిర్మించడం కోసం విద్యార్థులందరినీ ఐక్యం విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డివిజన్ ఉపాధ్యక్షులు వినోద్, శ్రీకాంత్, మనోజ్, కార్తీక్, శ్రవణ్, గణేష్, సుందర్,యశ్వంత్, జయవర్ధన్,మంజుల, అశ్విని, శారద, అనిత, వసుందర,అఖిల, భవాని, అరవింద్,శంకర్,చరణ్,రాజేష్, మల్లేష్,జైరాం, రామలిగం,సింహద్రి, తదితరులు పాల్గొన్నారు.

# 830 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మాత్రలు




**ఎలిగేడు, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : మండలం లోని శివపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పశువైద్యురాలు ఝాన్సీ తెలిపారు.అందు లో భాగంగా 830 పశువులు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు అందజేశామని చెప్పారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ దుగ్యాల వాణి – గోపాల్ రావు, ఉప సర్పంచ్ పొన్నాల సౌజన్య , యాదవ సంఘం అధ్యక్షులు అమ్ముల ఓదెలు గోపాల మిత్ర సమ్మయ్య, పాకీరొద్దీన్, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం



**ఎలిగేడు, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ యాకన్న మాట్లాడుతూ కుల వివక్షతను పాటిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పౌరుడు తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో సమానత్వం నెలకొల్పడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి భాస్కరరావు, సర్పంచ్ రంగులత శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం. ఆంజనేయులు, గిర్దావర్ వి. జయలక్ష్మి, జిపిఒ అనిల్ కుమార్, ఏఎస్ఐ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి ఎస్. పాపయ్యతో పాటు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు హాజరయ్యారు.గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పౌర హక్కులపై అవగాహన పెంపొందించుకున్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం, కుల వివక్షత నిర్మూలన వంటి అంశాలపై చర్చ సాగింది. సమాజంలో ఐక్యత, గౌరవం, సమానత్వం కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఈ వేడుకలో పునరుద్ఘాటించబడింది.

# మొగిలిగిద్దలో శ్రీ గోదా రంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం



**ఫరూక్ నగర్, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా ఫరూక్నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో అతి పురాతనమైన శ్రీ గోదా రంగనాథ స్వామి దేవాలయంలో వైకుంఠ ద్వార దర్శనం ఆధ్యాత్మిక వైభవంతో జరిగింది. ఈ పవిత్ర సందర్భంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, మండల మాజీ అధ్యక్షులు అనుమారి మురళీధర్, సామాజిక కార్యకర్త నీల రవీందర్, యోగ గురువు గవ్వయ్య సార్ తదితరులు పాల్గొన్నారు.వైకుంఠ ద్వార దర్శనం ద్వారా భక్తులు స్వామి వారి కృపను పొందుతూ ఆధ్యాత్మిక ప్రశాంతతను అనుభవించారు. దర్శన భాగ్యం కలిగిన ప్రతి ఒక్కరూ దేవాలయ మహిమను స్మరించుకుంటూ, ఈ పవిత్ర క్షణం తమ జీవితంలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని భావించారు.దేవాలయ పరిసరాలు భక్తుల సందోహంతో కిక్కిరిసిపోయి, భక్తి గీతాలతో, హారతులతో ఆధ్యాత్మిక వాతావరణం అలరారింది. సమాజంలో శాంతి, ఐక్యత, భక్తి భావాలను పెంపొందించేలా ఈ దర్శనం ప్రభావం చూపుతుందని పాల్గొన్నవారు పేర్కొన్నారు.

# నూతన సంవత్సరం నూతన ఒరవడికి నాందికావాలి




డిసెంబర్ చివరివారం వచ్చిందంటేచాలు నగరాలు,పట్టణాలలో హెూటల్స్, రెస్టారెంట్లు, పబ్బులు వేడుకలకోసం సర్వం సిద్ధంచేసుకునే పనిలో నిమగ్నమైపోతుంటాయి .వ్యాపారసంస్థలు, సంఘాలు,సమూహాలు కొత్తసంవత్సర క్యాలెండర్ తయారీలో నిమగ్నమైపోతారు.మహిళలోకం నూతనముగ్గులకై పరిశోధనలు గావిస్తుంటారు.యువత అంతా కార్యక్రమాలపై వివిధరకాల ప్రణాళికలు రచించుకునేపనిలో మునిగిపోతుంటారు.ప్రస్తుత సమాజంలో బాదేసిన,సంతోషంవేసిన పార్టీలు చేసుకోవడం సర్వసాధారణమైపోయింది.ఎప్పుడో ఒకసారి పండుగలకు,పబ్బాలకు జరుపుకునేటటువంటి వేడుకలు కాస్త నిత్యజీవితంలో భాగమై ఏదో ఒకసాకుతో ప్రతిరోజు జరుపుకునే స్థితిలోకి వెళుతున్నారు.అందులోభాగంగానే వేడుకలను జరుపుకునే కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి భారీపెట్టుబడులు పెడుతూ వ్యాపారంచేయడం ఒక్కేత్తైతే,దేశంలో,రాష్ట్రంలో మద్యం అమ్మకాల లెక్కలుసైతం సగటు మనిషిని ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తాయని చెప్పవచ్చు.ఇక్కడ ఆలోచించాల్సిన విషయమేమిటంటే మనదేశ సంస్కృతి,ఆచారాలకు విరుద్ధంగా పాశ్చాత్యీకరణ ఏమేర వ్యాప్తిచెందుతుందో అర్థంగాకమానదు.ఏదిఏమైనప్పటికీ ప్రస్తుత పరిణామాలదృష్ట్యా భిన్నమైన వాతావరణం నెలకొంది.కావున ఇలాంటి వేడుకలకు ఎంతదూరంగా ఉంటే అంత శుభపరిణామమని చెప్పకతప్పదు. ఇలాంటి పాశ్చాత్య దేశాలనుండి సంక్రమించిన వేడుకల వలన కేవలం యువత సరదాలకోసం,విందువినోదాలు నేపథ్యంలో మతిస్థిమితం లేకుండా తాగి తందనాలు ఆడటం,మత్తులో స్థిరత్వంకోల్పోయి ఏంచేస్తున్నారో తెలియకుండా,అచేతన స్థితిలోకి వెళ్లి తనప్రాణాలకే ముప్పును 'కొని'తెచ్చుకుని వారి తల్లిదండ్రులకు పుత్రశోకానికి గురిచేయడమనేది ప్రతిఏటా అక్కడక్కడ జగమెరిగిన విషయమే.ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతాయని తెలిసికూడా కార్యక్రమాలను నిర్వహిస్తూ,ఎందరికో హానికలిగిస్తూ,ఇతరులను సైతం తీవ్రఇబ్బందులకు గురిచేస్తున్నారనడంలో నిజంలేకపోలేదు. ప్రతిసంవత్సరం ప్రభుత్వాలు సైతం వైన్ షాపులకు,బార్స్,రెస్టారెంట్స్,పబ్బులకు అర్ధరాత్రి 12 దాటాక సైతం షరతులతో కూడిన అనుమతులివ్వడం జరుగుతూ వస్తుంది.కావున దానికితగినట్లుగా నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.తాగిన మత్తులో విచక్షణజ్ఞానాన్ని కోల్పోయి క్షణికావేశంలో చేసే సంఘటనలు ఎందరి జీవితాలనో అతలాకుతలం చేసిన సందర్భాలున్నాయి.కావున ఉడుకురక్తంతో ఊగిసలాడే యువత,క్షణంపాటు ఆలోచించి ఇలాంటి వేడుకలను ప్రతీకారాలకు వేదికగా మార్చకుండా జరుపుకుంటే మంచిది.కావున ఆ కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. సరదాగా స్నేహితులతో సంతోషంగా గడపాలని,ఇలాంటి వేడుకలలో ఆనందాన్ని పొందాలని ప్రతిఒక్కరికి ఉంటుంది.కానీ అనుకున్న పరిస్థితులు తారుమారవ్వడానికి కారణం కేవలం మద్యం,డ్రగ్స్ సేవించడమే.ఆతర్వాత చేసినతప్పులను సరిదిద్దుకోవడానికి జీవితాలు సరిపోవు.మద్యంమత్తులో ఎనలేని ధైర్యంవచ్చి ఎన్నో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడడానికి దారితీస్తుంది.కావున యువత చాలాజాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.ప్రత్యేకంగా ప్రేమవిషయం ఇలాంటి గొడవలకు కారణమవుతూ,గొడవలకు దిగి తమజీవితాలను సర్వనాశనం చేసుకోవడం జరుగుతుంది.ఇదేకాకుండా పలురకాల సమస్యలు గుర్తుకొచ్చి,ఆవేశాలకులోనై తమజీవితాలతో పాటు కుటుంబసభ్యులను సైతం రోడ్డునపడేసిన సందర్భాలెన్నో ఉన్నాయన్న విషయం అందరికీ తెలిసిందే."చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఎలాంటి ప్రయోజనం చేకూరదు". ప్రభుత్వం సైతం డిసెంబర్ 31 అర్ధరాత్రి మద్యం సేవించి వాహనం నడిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తూ,వివిధరకాల ఆంక్షలు విధిస్తూ హెచ్చరికలు జారీచేస్తుంది.అందుకే యువత జాగ్రత్తగా వ్యవరించాల్సినవసరం ఎంతైనా ఉన్నది.వీధులలో,జనసమూహాలలో పెద్దపెద్ద శబ్దాలనిచ్చే సౌండ్ బాక్స్ లనుపెట్టి డీజే పాటలతో డాన్సులుచేయడం,ఇరుగుపొరుగు వారికి ఆటంకం కలిగించడంఅనేది శుభపరిణామం అనిపించుకోదు.సంతోషకరమైన వేడుకలు జరుపుకోవడంలో తప్పులేదు.కానీ ప్రస్తుత పరిస్థితులకనుగునంగా నడుచుకుంటూ,ఏలాంటి చెడుపరిణామాలకు దారితీయకుండా జాగ్రత్త వ్యవహరిస్తూ ,కుటుంబసభ్యులతో ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకుంటూ అందరు సంతోషించవచ్చు.జీవితంలో మంచిపేరు ,హెూదా తెచ్చుకోవడానికి అహర్నిశలు కష్టపడుతూ ఎంతోకాలం వేచిచూడాలి.కానీ అదేపేరును క్షణికావేశంతో క్షణంలో పోగొట్టుకునే అవకాశాలుంటాయి.కావున జాగ్రత్త పాటిస్తూ గతసంవత్సరంలో విజయాలను,పరాజయాలను విశ్లేషించుకుని తగినవిధంగా మార్పులు,చేర్పులు చేసుకుంటూ నూతన సంవత్సరంలోకి నూతనంగా సరికొత్త లక్ష్యాలను ఏర్పరుచుకుని,వాటి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ,వాటి అమలుకు ప్రణాళికలు రూపొందించుకోని నూతనకార్యాలు ప్రారంభిస్తూ,శాశ్వితంగా గుర్తుండటానికి ఒక నిర్దేశితకాలంగా ఉపయోగించుకుంటూ విజయంవైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనాఉంది. సమాజంలో బాధ్యతయుతంగా నడుచుకోవడానికి సరికొత్త నిర్ణయాలు తీసుకోని పలువురికి ఆదర్శంగా నిలవాలి.అలాగే ఎప్పటికప్పుడు ప్రభుత్వాల పాలనాతీరును అంచనావేస్తూ సమాజానికనుగుణంగా ప్రతిస్పందిస్తూ పౌరవిధిని నిర్వహించడానికి పూనుకోవాలి.అందులోభాగంగానే ప్లాస్టిక్ రహిత సమాజనిర్మాణంలో పాల్గొంటూ,పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడంలో తనవంతుబాధ్యతను నిర్వర్తిస్తూ,అవినీతిరహిత సమాజం ఏర్పాటుకై తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించుటకు ఇలాంటి వేదికలనుపయోగించుకోవడానికి పూనుకోవాలని ఆశిద్దాం.

**వ్యాసకర్త**

డా.పోలం సైదులు,

తిరుమలగిరి,వంగూర్ మండలం,

9441930361.



## రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేత



**కడ్తాల్, డిసెంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల్ మండలం గనుగుమర్ల తండ గ్రామపంచాయతీ పరిధిలోని కనుగుబాయ్ తండకు చెందిన విస్లావత్ థౌరియా నాయక్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి తౌరియా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తార్య మృతదేహానికి పూలమాలేసి నివాళులర్పించారు. తదుపరి థౌరియా కుటుంబ సభ్యులకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కడ్తాల్ గ్రామానికి చెందిన మూడ లక్ష్మమ్మ కు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఐదు వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భిక్య నాయక్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ బీసీ మండల అధ్యక్షుడు పిప్పల వెంకటేష్ ఉప సర్పంచ్ లక్పతి నాయక్ వార్డు సభ్యులు శ్రీను నాయక్ నాగార్జున రాజు నాయక్ మాజీ ఉపసర్పంచ్ శారద పాండు నాయక్ నాయకులు భీమన్ దేవు నాయక్ లక్ష్మణ్ నాయక్ నరేష్ జాన్యా రవి శ్రీను సేవ్య వెంకటేష్ సైదులు గణేష్ లక్ష్మయ్య నర్సింగ్ సక్రు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పెన్షన్ కష్టాలు





**కడ్తాల్, డిసెంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో ఆసరా పెన్షన్ల కోసం ఆశగా ఎదురు చూస్తుంటారు. ఇక ప్రతి నెలా పోస్ట్ ఆఫీస్ లో పెన్షన్ దారులకు అవస్థలు మాత్రం తప్పడం లేదు. పోస్ట్ ఆఫీస్ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో.. పింఛన్ కోసం వచ్చే వయసు పైబడిన వృద్ధులు, వికలాంగులు వితంతువులు తదితరుల లబ్ధిదారులు అంగవైకల్యం కలిగిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెన్షన్ల కోసం ఉదయం నుంచే పోస్ట్ ఆఫీస్ ముందు క్యూ కడుతున్నారు. ఉదయం సమయంలో తెరుచుకోవాల్సిన పోస్ట్ ఆఫీస్ తలుపులు ఇష్టారీతిన తెరుచుకుంటున్నాయి. బిపియం పోస్ట్ మెన్ సమయ పాలన పాటించకపోవడంతో.. ఆఫీస్ సమయపాలన ఎప్పుడు తెరుచుకుంటుందో, అసలు తెరుచుకుంటుందో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని పింఛన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. తెరుచుకుంటుందో, అసలు తెరుచుకుంటుందో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని పింఛన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. పోస్టాఫీస్ ముందు ఉదయం 8 గంటల నుంచే పింఛన్ దారులు క్యూ కట్టారు. మిట్ట మధ్యాహ్నం అవుతున్నా పోస్ట్ ఆఫీస్ తెరుచుకోకపోవడంతో.. పింఛన్ దారులు పడిగాపులు కాచి నీరసించిపోయారు. ప్రతినెలా ఇదే తంతు కొనసాగుతోందని, ఎప్పుడొస్తారో, ఎప్పుడు పింఛన్లు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందని పింఛన్ దారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని పెన్షన్ దారులు డిమాండ్ చేస్తున్నారు.

## డ్వాక్రా మహిళా సంఘాల సమావేశం



**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లోయపల్లి గ్రామ సర్పంచ్ ఆంగోత్ రఘురాం నాయక్, ఉపసర్పంచ్ బొడ్డుపల్లి నాగరాజు విజయం అనంతరం డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహిళల మద్దతు, ఆశీర్వాదాలు తమ విజయానికి కీలకమని సర్పంచ్, ఉపసర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు.డ్వాక్రా గ్రూపులు గ్రామ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలని పేర్కొంటూ, మహిళల సాధికారత కోసం పలు హామీలు ప్రకటించారు. బ్యాంక్ లింకేజ్ రుణాలు, స్త్రీనిధి రుణాలు, స్వయం ఉపాధి యూనిట్లకు ప్రోత్సాహం, శిక్షణ కార్యక్రమాలు, మహిళల భద్రతకు పంచాయతీ స్థాయిలో మద్దతు అందిస్తామని తెలిపారు. సీసీ సంతోష్ మాట్లాడుతూ గ్రామానికి రెండు భవనాలు ఇప్పటికే సాంక్షన్ అయ్యాయని, స్థలం చూపిస్తే ప్రభుత్వం నిర్మాణానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు స్త్రీనిధి, పీఎం విశ్వకర్మ, ఆరోగ్యశ్రీ, ఉజ్వల, పీఎం ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్ ు మహిళలకు చేరేలా కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఓ అధ్యక్షులు జానమ్మ, శోభ, ప్రసన్నలక్ష్మి, వీఓఏలు సునీత, వనజాత, మంగా, ఓబీ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసును ఛేదించిన డిండి పోలీసులు

-మూడు సంవత్సరాల క్రితం జరిగిన దొంగతనం కేసు.
-ఇద్దరు నిందితుల అరెస్ట్ .
-10 తులాల బంగారం స్వాధీనం.
-డిండి సీఐ బీసన్న.



**దేవరకొండ డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా,డిండి మండలం వీరబోయినపల్లి గ్రామంలో మూడు సంవత్సరాల క్రితం జరిగిన 10.5 తులాల బంగారం దొంగతన కేసును డిండి పోలీసులు విజయవంతంగా ఛేదించారు. వీరబోయినపల్లి గ్రామానికి చెందిన తుమ్మల పద్మ, భర్త వెంకటయ్య, వయస్సు 48 సంవత్సరాలు గల ఆమే, తేది 15-02-2022 న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, బీరువాలో ఉన్న 10.5 తులాల బంగారాన్ని దొంగిలించినట్లు తెలిపారు.
ఆ సమయంలో కుటుంబ సభ్యుల మధ్య అంతర్గత తగాదాలు కొనసాగుతుండటంతో, కుటుంబ సభ్యులే బంగారం తీసి ఉండవచ్చని భావించి గ్రామ పంచాయతీ నిర్వహించగా, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. కేసు వెలుగులోకి వచ్చిన విధానం,తేది 16-12-2025 న వీరబోయినపల్లి గ్రామంలోనే అదే బాధితురాలి ఇంట్లోకి నిందితుడు జంగ పరశురాములు మరోసారి దొంగతనం చేయడానికి ప్రయత్నించగా, కుటుంబ సభ్యులు అతడిని గమనించి గుర్తుపట్టారు.ఈ సందర్భంగా గతంలో జరిగిన బంగారం దొంగతనానికి కూడా ఇతడే కారణమై ఉండవచ్చని అనుమానంతో డిండి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మొత్తం ఘటన వెలుగులోకి వచ్చింది.
బాధితుల ఫిర్యాదు మేరకు డిండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, విచారణ చేపట్టగా నిందితులు పైన తెలిపిన నేరాన్ని తమే చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 10 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు తరలించడం జరిగింది.నేరస్థుల వివరాలు
1).జంగ పరశురాములు, తండ్రి లక్ష్మయ్య, వయస్సు 31 సంవత్సరాలు, వృత్తి: ఆటో డ్రైవర్, నివాసం: వీరబోయినపల్లి గ్రామం, డిండి మండలం.
2).కేతావత్ నరసింహా, తండ్రి చత్రపతి, వయస్సు 37 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: రూప్లా తండా, వీరబోయినపల్లి గ్రామం.స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు
1).చుట్టూ ఉంగరం - 7 తులాలు 2 గ్రాములు (72 గ్రాములు)
2).రాయి అమర్చిన బంగారు ఉంగరం - అర తులం
3).బంగారు చైను - అర తులం
4).సాధారణ బంగారు నాణెం
5).2 తులాలు బంగారం
6).ఒక సెల్ ఫోన్ఈ కేసును సత్వరంగా, సమర్థవంతంగా ఛేదించిన డిండి ఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ సైదులు, కానిస్టేబుళ్లు శ్రవణ్, వెంకటేష్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు





**యాచారం డిసెంబర్ 30( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు ఆలయాలకు రావడంతో ఆలయ నిర్వాహకులు భక్తులు ఆలయంలో దర్శనానికి ప్రవేశం కోసం ఉత్తర దిశ నుండి ఆలయాల్లో ప్రవేశించడానికి ఏర్పాట్లు చేశారు. ప్రజలు ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉపవాసాలు ఉండి మందిరాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నా రు. యాచారం మండల కేంద్రముతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా మూల విరాట్టుకు అర్చకులు ఏకాంతంగా కైంకర్యాలను నిర్వహించారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం వైకుంఠ ద్వారాలను అర్చకులు తెరిచారు.
దేవాలయం లో భక్తుల గోవిందా గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి. యాచారం మండల కేంద్రంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి



దేవాలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్న యాచారం సర్పంచ్ మస్కు అనితా దేవాలయ కమిటీ చైర్మన్ ప్రత్యేక పూజలు చేశారు . మరియు కొత్తపల్లి-తక్కళ్లపల్లి గ్రామంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ గోదాదేవి శ్రీ పద్మావతి దేవి శ్రీ వెంకటేశ్వరా స్వామి గుట్ట పైన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మస్కు అనితా మాట్లాడుతూ... కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి-సమృద్ధులతో వర్ధిల్లాలని హృదయపూర్వకంగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజాసేవనే పరమధర్మంగా భావిస్తూ, యాచారం గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే శక్తిని, సంకల్పబలాన్ని స్వామివారు ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. తక్కళ్లపల్లి లో యాచారం మండల మాజీ వైఎస్ ఎంపీపీ గంజి రామక్రిష్ణ , బిలకంటి శేఖర్ రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నూతన సంవత్సర వేడుకలపై పోలీసు హెచ్చరికలు



**మహబూబాబాద్, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజలకు ముఖ్యమైన సూచనలు చేశారు. ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎవరు అతిక్రమించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొత్త సంవత్సరం వేడుకల పేరుతో మత్తులో వాహనాలు నడపడం, వేగంగా రోడ్లపై ఇష్టారాజ్యంగా ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు.పోలీసుల అనుమతి లేకుండా న్యూ ఇయర్ కార్యక్రమాలు నిర్వహించరాదని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా డి.జె సౌండ్ ఏర్పాటు చేయడం నిషేధమని తెలిపారు. టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆయన సూచించారు. సాయంత్రం ఆరు గంటల నుండి ప్రత్యేక పోలీస్ బృందాలు వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపడతాయని, మత్తులో వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, కేక్ కటింగ్ కార్యక్రమాలు, బైక్ రేసింగ్ లాంటి వాటిని నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి గారు స్పష్టం చేశారు. ప్రజలు సురక్షితంగా, శాంతియుతంగా కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్‌లో
# పత్రీజీ ధ్యాన మహాయాగం..







## నేటితో ముగియనున్న ధ్యాన సంబరాలు

**కడ్తాల్, డిసెంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** ధ్యానం సర్వరోగనివారిణి, ధ్యానం సకలభోగకారిణి, ధ్యానం సత్యజ్ఞాన ప్రసాదిని అని బ్రహ్మర్షి పత్రీజీ తెలిపారు. అన్నిరోగాలకు మూలం భవరోగమని స్పష్టం చేసారు. నాకు దేహం కావాలి, నేను బతకాలి అనే రోగం భవరోగమన్నారు. ఈ భవరోగంతోనే మిగతా రోగాలు వస్తాయని, దీనిని విడిచిపెడితేనే ముక్తి. నిర్వాణం, పరమపదసోపానం పొందుతామని తెలిపారు. తాను ఆత్మపదార్థాన్ని అన్న విషయం ఎప్పుడైతే తెలుసుకుంటాడో భవరోగం మాయమవుతుందని స్పష్టం చేసారు .మరో సందేశంలో నాలుగు రకాల ఆలోచన విధానాలైన వినాశకరమైన ఆలోచనలు, వ్యతిరేక ఆలోచనలు, సానుకూల ఆలోచనలు, అద్భుత ఆలోచనల గురించి వివరించారు. కొత్తగా స్కూటీ కొన్న వ్యక్తి నేను కిందపడుతానేమో అనే భయపడతే నిజంగానే యాక్సిడెంట్ జరుగుతోందని, దానిని వినాశకర ఆలోచనలంటారని, కింద పడుతానో లేదో అనే ఆలోచిస్తే వ్యతిరేక ఆలోచనలని, సురక్షితంగా వెళ్లి వస్తా అనే ఆలోచిస్తే సానుకూల ఆలోచనలను తెలిపారు. అయితే నేను 30 నిమిషాల్లో సురక్షితంగా వెళ్లి తిరిగి వస్తా అనే లక్ష్యం పెట్టుకుంటే అద్భుత ఆలోచనలను వివరించారు. ఎలాంటి ఆలోచనలను విడుదల చేస్తామో ఆదే జరుగుతోందని, మన జీవితం మారాలంటే ఆలోచన విధానం మారాలని సూచించారు. పీఎస్ఎస్ఎం ప్రాజెక్ట్ లో భాగంగా




నంద్యాల జిల్లా మంగనపల్లిలోగల సదానంద గురూ ఆశ్రమం నందవరం ఏవీని ప్రదర్శించారు. 2017 సంవత్సరంలో ఈ ఆశ్రమంలో సద్గురు సదానంద నిత్యఅన్నదాత సేవా ట్రస్ట్ ఏర్పాటైనట్లు బ్రహ్మణరత్న మారం శివప్రసాద్ తెలిపారు. 1998 సంవత్సరంలో ఆశ్రమంలో గురుపౌర్ణమి ఉత్సవాలు, సద్గురు సదానందయోగి వర్ధంతి వేడుకలు నిర్వహించడం జరిగిందని చెప్పారు.సదానందయోగి సమాధి మందిరం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచివుంటుంది తెలిపారు. అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బ్రహ్మణపల్లిలో గల శ్రీ ఓంకారేశ్వర అష్టాదశ పిరమిడ్ ధ్యాన శక్తి మహా క్షేత్రం ఏవీని ప్రదర్శించారు. ఈ పిరమిడ్ గురించి ట్రస్ట్ సభ్యులు వివరించారు. ఓంకారేశ్వర అష్టాదశ పిరమిడ్ ధ్యాన శక్తి మహా క్షేత్రంలో మౌనధ్యాన కార్యక్రమాలు అధికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నిత్యాన్నదాన ట్రస్ట్ ఏర్పాటు చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

**ధ్యానం చేస్తే సరైన జీవనవిధానం తెలుస్తుంది.. పీఎస్ఎస్ఎం నేషనల్ కోఆర్డినేటర్ మాధవి**

బ్రహ్మర్షి పత్రీజీ ధ్యానులు పాటించాల్సిన 18 ఆదర్శసూత్రాలు, 13 వ్యక్తి గత సూచనలు, ఆరు లక్ష్యాలను రూపొందించారని పీఎస్ఎస్ఎం నేషనల్ కోఆర్డినేటర్ మాధవి తెలిపారు. ప్రతి పిరమిడ్ మాస్టర్ వీటిని ఆచరిస్తున్నారా లేదా అనేది చెక్ చేసుకోవాలని సూచించారు. ధ్యానం చేస్తే సరైన జీవనవిధానం తెలుస్తుందన్నారు. ధ్యానం ద్వారా జీవిత లక్ష్యం తెలుసుకోవాలన్నారు. ప్రతి పిరమిడ్ మాస్టర్ రోజు మూడు గంటలు ధ్యానం, ఒక గంట స్వాధ్యాయం, సేవాతత్పురులతో సజ్జన సాంగత్యం చేసి వారికి ధ్యానం నేర్పించాలని సూచించారు. ఎవరితే ఎక్కువ కష్టాలు, అవమానాలను భరిస్తారో వారే జ్ఞానోదయమైన మాస్టర్స్ అని తెలిపారు. ధ్యానంతో మనుసు శూన్యమవుతుందని వివరించారు. ఎప్పుడు వర్తమానంలోనే జీవించాలని, మనసులో ఎలాంటి సంశయాలను పెట్టుకోకూడదని సూచించారు.

# వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

**మహబూబ్ నగర్ , డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**



ముక్కోటి ( వైకుంఠ ) ఏకాదశి సంద్భంగా ఉత్తర ద్వారము ద్వారా పాలమూరు ( మహబూబ్ నగర్ ) కాటన్ మిల్ వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువుదీరి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న వాసవి స్త్రీ శక్తి పురస్కార గ్రహీత నిచ్చనమెట్ల వరలక్ష్మి మరియు సేవాభూషణ్ అవార్డు గ్రహీత నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ... ఉత్తర ద్వారం ద్వారా స్వామీజీని దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల అపార నమ్మకం. ఈసందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కలియుగ దైవం ఆ శ్రీ వేంకటేశ్వరా స్వామిని పుష్యమాసం, శుక్ల పక్షం, ఏకాదశి నాడు దర్శించుకోవడం చాలా సంతోషముగా ఉందని, అదేవిదంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా దర్శనాలకు క్రమపద్ధతిలో వరుస క్రమములో దర్శనాలకు పంపించడం, అలంకరణలు భక్తులకు ఎంతో ఆకట్టుకుంటూ ఉండడం, అదేవిదంగా స్వామి వారికి, అమ్మవారికి, వరహాస్వామికి హారతి ఇప్పించి,బ్రాహ్మణులతో ఆశీర్వాదములతో పాటు తీర్థప్రసాదాలను తీసుకోవడం జరిగింది. ఉదయం నుంచి స్వామీవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయం పెద్దలకు, బ్రాహ్మణులకు, పోలీసు వారికి, వాలంటీర్లకు మరియు ఈ ఏకాదశి కార్యక్రమమును నిర్వహించిన ప్రతిఒక్కరితో పాటు దర్శనం చేసుకున్న భక్తుల కుటుంబసభ్యులందరికి మరోసారి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరా స్వామి ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు నిచ్చనమెట్లరాజేంద్రప్రసాద్ అన్నారు.

# ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలి

**-రావిచేడ్ సర్పంచ్ గోపాల్.**



**కడ్తాల్, డిసెంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** ప్రస్తుత సమాజంలో మానవులుగా జన్మించిన ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సర్పంచ్ బొప్పిడి గోపాల్ సూచించారు. మంగళవారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి మనశ్శాంతి కలిగి సమస్యలు దూరమవుతాయన్నారు. భక్తి భావంతో పూజలు, యజ్ఞాలు చేయడం వల్లనే ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. కులమతాలకు అతీతంగా భక్తిభావంతో మెలగాలన్నారు.. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, మాజీ ఎంపిటిసిలు యాదయ్య, రంగయ్య, వసంత, నాయకులు లింగం, రామచంద్ర జి, బీరప్ప, చెన్నయ్య, సంతోష్, శేఖర్, యాదగిరి, శ్రీనివాస్, సాయికుమార్, వేణుమాధవ్, బ్రహ్మానందం, అర్చకులు రామచంద్ర రావు, మురళీధర్ రావు, తదితరులున్నారు.

## బోడుప్పల్ సర్కిల్‌లో కొత్త డిప్యూటీ కమిషనర్‌కు ఘన స్వాగతం




**బోడుప్పల్, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంగళవారం రోజు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దానగాళ్ల యాదగిరి, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ హైదరాబాద్‌లో కలిసిన తరుణంలో శైలజ గారు ఇదే ప్రాంతానికి డిప్యూటీ కమిషనర్‌గా రావడం తమ అదృష్టమని పేర్కొన్నారు.తన 13వ డివిజన్ ప్రజలకు కావలసిన మౌలిక వసతుల ఏర్పాటులో కమిషనర్ పూర్తి సహకారం అందిస్తున్నారని, రాజీవ్ నగర్ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ కీ షెడ్, రెలింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయని వివరించారు. త్వరలో డబుల్ బెడ్‌రూమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ కి ఘనసన్మానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ అధ్యక్షులు గోపు రాములు, ఎంఆర్పీఎస్ నాయకులు మల్లెపాక శంకర్, పత్రికేయులు మంచినీళ్ల శ్రీనివాస్, కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణా రాష్ట్ర పంచాయితీ సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**హైదరాబాద్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణా రాష్ట్ర పంచాయితీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఆశాదీప్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా మనోహరాబాద్ గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్ ఎంపికయ్యారు.సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాదాని భూమన్న యాదవ్ నూతన కార్యవర్గానికి ఎన్నిక పత్రాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా చీర్ల అనూష భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ సమస్యలతో పాటు రాష్ట్రంలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ ఎన్నికలతో రాష్ట్ర సర్పంచుల సంఘానికి కొత్త ఉత్సాహం లభించిందని, గ్రామీణాభివృద్ధి దిశగా మరింత బలమైన అడుగులు వేస్తామని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది.

## రబీ సీజన్‌లో యూరియా పంపిణీ సాఫీగా సాగాలని అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ సూచన



**నల్లగొండ, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రబీ సీజన్‌లో రైతులకు యూరియా సరఫరా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మరియు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో లాగా క్యూ లైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఫర్టిలైజర్ బుకింగ్ యాప్" రైతులకు ఎంతో సౌకర్యంగా ఉందని వివరించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ ఇళ్లలో నుండే ఏ షాపులో ఎంత యూరియా అందుబాటులో ఉందో, ఏ డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందో వెంటనే తెలుసుకోవచ్చని తెలిపారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ యాప్ ద్వారా యూరియా పంపిణీ క్రమబద్ధీకరణ సాధ్యమవుతుందని, అలాగే ఏ పంటకు ఎంత యూరియా అవసరమో కూడా యాప్‌లో స్పష్టంగా అందుబాటులో ఉందని చెప్పారు. నల్లగొండ జిల్లాలో ఈ యాప్ విజయవంతంగా అమలవుతున్నప్పటికీ, రైతులలో ఇంకా విస్తృత ప్రచారం అవసరమని అదనపు కలెక్టర్ సూచించారు.

# వార్డుల వారీగా ఓటరు జాబితా వేగవంతం చేయాలని కలెక్టర్ - కుమార్ దీపక్

**మంచిర్యాల, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో జరిగిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ వలియత్ అలీ, పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా స్పష్టంగా రూపొందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు నివాస ప్రాంతాలకు సమీపంలో ఉండేలా గుర్తించాలని, ఒక్కో కేంద్రంలో 800 మందికి మించి ఓటర్లు ఉండకూడదని తెలిపారు. జనవరి 1, 2026 నాటికి ముసాయిదా జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు.అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, త్రాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జనవరి 25న హైదరాబాదులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా పిలుపు



**నల్లగొండ, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు జనవరి 25 నుండి 28 వరకు హైదరాబాదులో జరగనున్నాయి. ఈ సందర్భంగా జనవరి 25న నిర్వహించే బహిరంగ సభకు వేలాదిగా మహిళలు తరలిరావాలని ఐద్వా నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడు నల్గొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో జరిగిన ఐద్వా జిల్లా సమావేశం కొండా అనురాధ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాల కాలంలో మహిళా సంఘం చేపట్టిన ఉద్యమాలు, కార్యక్రమాలను ఈ మహాసభల సందర్భంగా సమీక్షించడంతో పాటు, రాబోయే కాలానికి అవసరమైన కర్తవ్యాలను నిర్ణయించనున్నట్లు తెలిపారు. మహిళలపై చట్టాలు ఉన్నప్పటికీ హింస తగ్గకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. "అర్ధరాత్రి మహిళలు స్వేచ్ఛగా నడవగలిగిన రోజే నిజమైన స్వాతంత్ర్యం" అని గాంధీజీ చెప్పిన మాటలు నేటి పరిస్థితుల్లో అమలుకావడం లేదని, పట్టపగలే మహిళలు భయపడే పరిస్థితి ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాల అమలులో విఫలమవుతున్నాయని విమర్శించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద మహిళలు విద్య, వైద్యం నుండి దూరమవుతున్న పరిస్థితి తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు విపరీతంగా పెరుగుతుండగా, ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడుతున్నాయని, వాటిని బలోపేతం చేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ అన్ని డిమాండ్ల సాధన కోసం జనవరి 25న హైదరాబాదులో జరిగే బహిరంగ సభలో మహిళలందరూ వేల సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పాలడుగు ప్రభావతి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిమ్మల పద్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, సహాయ కార్యదర్శులు సుల్తానా, దామెర లక్ష్మి పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి బోరు మోటార్ అందజేత

-శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సేవలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉంది
-కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం







**వర్ధన్నపేట, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** వర్ధన్నపేట మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకల కార్యక్రమంలో కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల నీటి అవసరాలను తీర్చేందుకు బోరు మోటార్ ను తమ సొంత ఖర్చులతో కొనుగోలు చేసి ఆలయానికి విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సేవలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఈగ మల్లేశం సేవ గుణాన్ని వర్ధన్నపేట పట్టణ వాసులు అభినందించారు. అనంతరం అర్చకులు ఈగ మల్లేశంకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యాకయ్య, కొండేటి సత్యం, సమ్మెట శ్రీనివాస్, తుమ్మల రవీందర్, సమ్మెట రాంబాబు, మార్త సారంగపాణి, కరిమిల్ల సంపత్ రావు, పెద్దూరి రాజ్ కుమార్, యుగంధర్, సమ్మెట సుధీర్, చెన్న శ్రీధర్, గుజ్జ సోమేశ్వర రావు, కేదారి, మల్లెపాక అనిల్, ఆరెల్లి నాగార్జున, దొమ్మటి భాను చందర్, వడ్లకొండ రవీందర్, అర్చకులు కలకోట గోపాల చారి, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

# కల్లు గీత కార్మిక సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక

-అధ్యక్షుడిగా జనుగాం యాకయ్య గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి సట్ల సూరయ్య గౌడ్






**వర్ధన్నపేట, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్** : వర్ధన్నపేట మండలం కల్లుగీత కార్మిక సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వీరస్వామి గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి బాలగాని రాంబాబు గౌడ్, పర్వతగిరి మండల అధ్యక్షుడు బండి సతీష్ గౌడ్ హాజరై కల్లు గీత కార్మిక సంఘం వర్ధన్నపేట నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా సుదగాని లక్ష్మణ్ గౌడ్, అధ్యక్షుడిగా జనుగాం యాకయ్య గౌడ్ , ఉపాధ్యాయులు ,సోషల్ మీడియా కన్వీనర్ కత్తి వేణు కుమార్ గౌడ్, మేరుగు రాజాలు గౌడ్, కొయ్యేటి కుమారస్వామి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సట్ల సూరయ్య గౌడ్, సహాయ కార్యదర్శి బూర అశోక్ గౌడ్, బొల్లెపల్లి కుమారస్వామి గౌడ్, మడత ప్రశాంత్ గౌడ్, కార్యవర్గ సభ్యులు కత్తి రాజు గౌడ్,బూర సంపత్ గౌడ్, సట్ల నరసింహులు గౌడ్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ గౌడ కుల అభివృద్ధికి తెలంగాణ కల్లుగీత కార్మికుల సంఘం లక్ష్యాల కోసం కృషి చేస్తామని, మాపై నమ్మకంతో మండలంలోని అధ్యక్ష ,ఉపాధ్యక్ష , ప్రధాన కార్యదర్శి లుగా నియమించినందుకు జిల్లా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ వీరస్వామి గౌడ్, బాలగాని రాంబాబు గౌడ్, ధర్మారం మండల అధ్యక్షుడు తాళ్ల పెల్లి నర్సయ్య గౌడ్, మండలంలోని వివిధ గ్రామాల గౌడ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ రాష్ట్ర మహాసభలకు విజయవంతం చేయాలని పిలుపు




**హుస్నాబాద్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను స్థానిక మోడల్ జూనియర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంసాని రాకేష్ మాట్లాడుతూ జనవరి 3, 4, 5 తేదీలలో శంషాబాద్‌లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి విద్యార్థి ప్రతినిధులు పాల్గొని రాష్ట్ర స్థితిగతులు, సంక్షేమ హాస్టళ్ల పరిస్థితులు, విద్యారంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదిస్తారని తెలిపారు. జాతీయ విద్యా విధానం అమలుకై ఏబీవీపీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. మూడు రోజుల మహాసభలో రాబోయే సంవత్సరపు కార్యక్రమాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి అంజి, కళాశాల కార్యదర్శి నిఖిల్, వర్షిత్, సుమంత్, సూచిత్ర, దీపికతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# కూనారం ఆర్.ఓ.బి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ - కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. జూలై 2026 నాటికి కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. 119 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న ఈ బ్రిడ్జికి సంబంధించిన పెండింగ్ భూ సేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలని, మార్చి 2026 నాటికి అండర్ పాస్ పనులు కూడా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. అతిథి గృహం ప్రహరి గోడ పనులు, ల్యాండ్ స్కేపింగ్, భద్రతా ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న జడ్పీ కార్యాలయ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, ఏప్రిల్ 2026 నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, తహసిల్దార్ రాజ్ కుమార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కమిషనరేట్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్- గౌస్ ఆలం



**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పలు విభాగాలను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల నిర్వహణ, రికార్డుల నమోదు, భద్రతా విభాగాల పనితీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయం, అడ్మిన్ విభాగం, మోటార్ ట్రాన్స్‌పోర్ట్, బెల్ ఆఫ్ ఆర్మ్స్, హోం గార్డ్స్, స్పెషల్ యాక్షన్ టీమ్, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్‌ల పనితీరును సమీక్షించారు. ఆయుధాల భద్రత, వాహనాల మెయింటెనెన్స్, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి విభాగంలో రికార్డులు సక్రమంగా, పారదర్శకంగా ఉండాలని, విధుల్లో అలసత్వం వహించరాదని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను బాధ్యతాయుతంగా కాపాడుకోవాలని, సాంకేతికతను వినియోగించి సేవలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, కమిషనరేట్ ఏవో మునిరామయ్య, ఆర్ఐలు రజినీకాంత్, కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రాజీవ్ రహదారిపై లారీలు ఢీకొని ఇద్దరికీ గాయాలు



**పాలకుర్తి, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బసంతనగర్ హెచ్‌కేఆర్ టోల్ గేట్ సమీపంలోని కన్నాల ఫ్లైఓవర్ వద్ద మంగళవారం రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దపల్లి మండలం హనుమంతునిపేటకు చెందిన తీగల మహేష్ బూడిద లోడుతో పెద్దపల్లి వైపు వెళుతుండగా, గోదావరిఖని వైపు సిమెంట్ లోడుతో వస్తున్న మరో లారీ యూ-టర్న్ వద్ద కారును తప్పించబోయి ఢీకొట్టింది. ఢీకొన్న లారీ టోల్ గేట్ వద్ద నిర్మించిన బస్టాండ్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మహేష్ చెయ్యి విరగగా, కోదాడకు చెందిన డ్రైవర్ దాసరి కిష్టయ్యకు కాలు విరిగింది. టోల్ గేట్ సిబ్బంది వెంటనే స్పందించి క్షతగాత్రులను బయటకు తీసి అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

# యువకుడిపై పి.డి యాక్ట్ నమోదు



**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మైనర్ బాలికలపై వరుసగా లైంగిక దాడులకు పాల్పడుతూ సమాజంలో భయభ్రాంతులు సృష్టిస్తున్న సంపంగి ప్రేమ్ కుమార్ (23)పై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ పి.డి. చట్టం (ప్రెవెంటివ్ డిటెన్షన్ యాక్ట్) ప్రయోగించారు. ఉత్తర్వులు జారీ చేసి నిందితుడిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ 2019 నుండి వరుస నేరాలకు పాల్పడుతూ, దొంగతనాలు, భౌతిక దాడులు, మైనర్ బాలికలపై లైంగిక వేధింపుల కేసుల్లో చిక్కుకున్నాడు. గతంలో ఒక మైనర్ బాలిక కిడ్నాప్, లైంగిక దాడి కేసులో 10 సంవత్సరాల జైలు శిక్ష పడగా, 2023లో పి.డి. చట్టం ప్రయోగించినప్పటికీ హైకోర్టు బెయిల్‌పై విడుదలయ్యాడు.జైలు నుండి బయటకు వచ్చిన తరువాత కూడా తన ప్రవృత్తిని మార్చుకోకుండా జూలై 2025లో అలుగునూరు సమీపంలోని ఎస్ఆర్ఎస్పి కాలువ వద్ద మైనర్ బాలికపై దాడి చేశాడు. బాలికను రాయి, గాజు సీసాతో హత్య చేయడానికి ప్రయత్నించిన కేసులో జూలై 20న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.సమాజ రక్షణ దృష్ట్యా ఇలాంటి పునరావృత నేరస్థులపై కఠిన చర్యలు అవసరమని భావించిన పోలీస్ కమిషనర్, పి.డి. యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ చర్యలో కరీంనగర్ రూరల్ ఏసిపి జి. విజయ్ కుమార్, తిమ్మాపూర్ సిఐ జి. సదన్ కుమార్‌తో పాటు ఇతర సిబ్బంది సమర్థవంతంగా పనిచేయడంతో వారిని ప్రత్యేకంగా అభినందించారు.

## సే నో టూ డ్రగ్స్ - సే యెస్ టూ స్పోర్ట్స్ వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా



**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యువతను వ్యసనాలకు దూరంగా ఉంచి క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు కేశవపట్నం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సే నో టూ డ్రగ్స్ – సే యెస్ టూ స్పోర్ట్స్ వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగిసింది. మొత్తం 20 జట్లు పాల్గొన్న ఈ పోటీలో కేశవపట్నం జట్టు విజేతగా నిలవగా, మొలంగూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ మాట్లాడుతూ యువత మానసిక ఒత్తిడికి లోనై డ్రగ్స్ వంటి చెడు వ్యసనాల వైపు మళ్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందించడమే కాకుండా క్రమశిక్షణను పెంచుతాయని, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలే ఉత్తమ మార్గమని సూచించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రీడారంగంలో రాణించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, హుజురాబాద్ ఏసిపి వి. మాధవి, హుజురాబాద్ రూరల్ సిఐ పి. వెంకటి, కేశవపట్నం ఎస్సై కె. శేఖర్, ఇతర పోలీస్ సిబ్బంది, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ముక్కోటి ఏకాదశి సందర్భంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించగా, ఈ సందర్భంగా కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దేవాలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.భక్తుల రద్దీతో ఆలయం సందడిగా మారి, విశేష పూజలు, హారతులు నిర్వహించారు.

# శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలోని చైతన్యపురి కాలనీలో రాగంపేట ఆర్యవైశ్య స్వచ్ఛంద సంస్థ చైర్మన్ నలుమాచు మనోహర్ స్వగృహంలో మంగళవారం శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞం పోస్టర్‌ను బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ, భూశంకర శర్మ, విశ్వనాథ్ శర్మ గార్లు ఆవిష్కరించారు. జనవరి 17 నుండి 23 వరకు టిటిడి కళ్యాణ మండపం, కరీంనగర్‌లో లోకకళ్యాణార్థం రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞం జరగనుంది. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ నలుమాచు మనోహర్ ఆధ్వర్యంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించడానికి రామాయణం వినాల్సిన ఇతిహాసమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నలుమాచు మనోహర్, నలుమాచు చంద్రశేఖర్, నలుమాసు సుదర్శన్, రామకృష్ణ హరిప్రసాద్, మల్లేశం, అమర్ సుధాకర్, వేణు, భూపతి, మురళి, నలుమాచు రాద, అల్లాడి రాధికతో పాటు సంస్థ సభ్యులు, దాతలు పాల్గొన్నారు. ధార్మిక బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని యజ్ఞాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు




**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేశపట్నంలోని కస్తూరిబా బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్‌లో స్నేహిత కార్యక్రమం-2 నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, డిప్యూటీ డిఎంహెచ్వో చందు, కేశపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రవణ్‌కుమార్ విద్యార్థినులకు భద్రత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్ష్యాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బాలికలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, పోషకాహారం, రుతుస్రావ పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లపై సూచనలు చేశారు. పాఠశాలల్లో ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని, వేధింపుల నివారణకు 1098 హెల్ప్‌లైన్ వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# పులి సంచారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరా



**కరీంనగర్ రూరల్ , డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పులి సంచారం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కేంద్ర శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరా తీశారు. జిల్లా అటవీ అధికారి బాలమణితో ఫోన్‌లో మాట్లాడి రైతులు, స్థానికులు భయపడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అటవీ అధికారులు అక్కడి ప్రాంతంలో పులి కాలి ముద్రలు ఉన్నట్లు ధృవీకరించారు. ఉమ్మడి అదిలాబాద్ అటవీ ప్రాంతం నుంచి వచ్చిన మగ పులిగా భావిస్తున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో పెద్దగా అటవీ ప్రాంతం లేకపోవడంతో అది పెద్దపల్లి వైపు వెళ్లి ఉండవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.పులి సంచారం విషయమై స్థానికులు, రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో మంత్రి వారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు.

# పారదర్శకంగా యూరియా సరఫరా



**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతిరోజు నిల్వలు, సరఫరా వివరాలను జిల్లా కేంద్రానికి నివేదించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక సహకార సంఘాల బాధ్యులతో సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాలో ప్రస్తుతం 4246 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ప్రస్తుత అవసరాలకు సరిపోతుందని కలెక్టర్ తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా అవగాహన కల్పించాలని, సమస్యలు తలెత్తితే మండల, క్లస్టర్ వ్యవసాయ అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఇబ్బందులు రాకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎం సమ్మాన్, ఫసల్ బీమా, పీఎం కిసాన్ యోజన, కృషి విజ్ఞాన కేంద్రం, ధాన్యం కొనుగోలు వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై కూడా సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారులు, సహకార సంఘాల బాధ్యులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు

## రంగవల్లుల పోటీల పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ బండి సంజయ్






**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జనవరి 2, 2026 శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక కళా భారతి లో రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు డాక్టర్ పోతుగంటి సుజాత రెడ్డి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆవిష్కరించారు. మహిళలలోని సృజనాత్మకతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డాక్టర్ సుజాత రెడ్డి కోరారు.
కార్యక్రమంలో శ్రీమతి సుంకరి లలిత, మీనా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆపద్బాంధవుడు



**చారకొండ, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చారకొండ మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన కందుకూరి వెంకటయ్య ఇటీవల మరణించగా, వారి కుటుంబానికి వెల్దండ మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు ఆపద్బాంధవుడిగా నిలిచారు. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన, పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వెంకటయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా బిఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని భాస్కరరావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యువసేన సభ్యులు కూడా కుటుంబానికి తోడ్పాటు అందించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు అప్పల శేఖర్ గౌడ్, జూపల్లి సర్పంచ్ అనూష జగపతి, యువసేన సభ్యులు ఎండి సిరాజ్, సత్యం యాదవ్, శివ యాదవ్, చంద్రాయన్‌పల్లి గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అదనపు సొలిసిటర్ జనరల్ కనకమేడలకు ఘన సన్మానం





**ఆమనగల్లు, డిసెంబరు 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ న్యాయవాది, రాజ్యసభ మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నేత కనకమేడల రవీంద్ర కుమార్ కు ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు, టీడీపీ నాయకులు మంగళవారం ఘన సత్కారం అందించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి అండేకార్ యాదిలాల్ నేతృత్వంలో న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో మర్యాదపూర్వకంగా అభినందనలు తెలిపారు.



తెలుగు రాష్ట్రాల నుంచి అత్యున్నత న్యాయస్థానంలో కీలక బాధ్యతలు నిర్వర్తించేందుకు అవకాశం రావడం ప్రతిష్టాత్మకమైందని, ఈ నియామకం న్యాయవాదులకే కాదు రాష్ట్రానికే గర్వకారణమని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లభించిన ఈ బాధ్యతలను రవీంద్ర కుమార్ సమర్థంగా నిర్వహిస్తారని, న్యాయవిధానంలో తెలుగు రాష్ట్రాల వాణిని మరింత శక్తివంతంగా వినిపిస్తారని సభ్యులు నమ్మకాన్ని వ్యక్తం చేశారు. న్యాయ రంగంలో ఆయన నిబద్ధత, అనుభవం భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను తాకేలా చేస్తుందని ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు జమీల్ అహ్మద్, జగన్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, శిరీష్, విజయ్ కుమార్ గౌడ్, టీడీపీ సీనియర్ నాయకులు కండె సత్యనారాయణ,అర్థం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలకు భారీ బందోబస్తు



**కరీంనగర్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి నుంచి జనవరి 1 తెల్లవారుజాము వరకు నగరం, జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పహారా, చెక్‌పోస్టులు, అదనపు బలగాలను మోహరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలు సీజ్ చేసి డ్రైవర్లను వైద్య పరీక్షలకు తరలిస్తామని హెచ్చరించారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, ప్రమాదకర డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచారు. మహిళలపై అసభ్య ప్రవర్తన, బహిరంగ గొడవలు సృష్టించే వారిని తక్షణమే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. డీజే సౌండ్ సిస్టమ్స్, బాణసంచా కాల్చడంపై పూర్తి నిషేధం విధించబడింది. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్‌లు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలు కుటుంబ సభ్యులతో బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోవాలని, ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడి సాధ్యం

## - కుమార్ దీపక్



**మంచిర్యాల, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వ్యవసాయంలో పంట మార్పిడి విధానం అవలంబిస్తే అధిక దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల అధికారులతో మాట్లాడుతూ వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు వాణిజ్య పంటలు, కూరగాయలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో పంట మార్పిడి అవసరమని, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూల ప్రాంతాలను గుర్తించి, లాభాలను వివరించి రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, పంపిణీ కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు నిబంధనల ప్రకారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారికి చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి మిమిక్రీ పోటీల్లో ఏకలవ్య విద్యార్థి ప్రతిభ



**వెల్దండ, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** వెల్దండ మండలంలోని గుండాల ఏకలవ్య స్కూల్ విద్యార్థి ఎం. వెంకటేష్ రాష్ట్రస్థాయి మిమిక్రీ పోటీల్లో తన ప్రతిభను చాటుకుని ద్వితీయ బహుమతిని అందుకున్నారు. హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గురుకులాల విద్యార్థులు పాల్గొన్నారు. కల్వకుర్తికి చెందిన వెంకటేష్ తన వినూత్న ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకుని ద్వితీయ బహుమతితో పాటు రూ. 7,500 నగదు బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి వి. నిత్యానందరావు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు కె.వి. రమణాచారి, గిరిజన సంక్షేమ గురుకులాల కార్యదర్శి కె. సీతాలక్ష్మి, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్, ఆయన సతీమణి శోభా వేణుమాధవ్, సినీ నటుడు మరియు మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. విజేత వెంకటేష్‌ను ఏకలవ్య స్కూల్ ప్రిన్సిపల్ సుమన్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కోడం భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ విజయంతో ఏకలవ్య స్కూల్ గర్వకారణంగా నిలిచింది.

# వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని రంగనాయకుల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు





**వెల్దండ, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** వెల్దండ మండల కేంద్రంలోని రంగనాయకుల దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని వారు పేర్కొన్నారు. ముక్కోటి ఏకాదశి అని పిలువబడే ఈ పవిత్ర రోజు ధనుర్మాసంలో వస్తుందని, శ్రీ మహావిష్ణువు వైకుంఠ ద్వారాలు తెరచి భక్తులకు దర్శనమిస్తారని ప్రజల విశ్వాసం. ఉపవాసం, జాగరణ, విష్ణు నామస్మరణ, ఉత్తర ద్వార దర్శనం ద్వారా మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సిమ్ముల తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# ఘనంగా పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం

**హైదరాబాద్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




తెలంగాణ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ గ్రంథాలయ శాస్త్రవేత్త ఏ.ఏ.ఎన్. రాజు రచించిన మాన్యువల్ ఆఫ్ డియూయి డెసిమల్ క్లాసిఫికేషన్ – 23వ ఎడిషన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ గ్రంథాలయ శాస్త్రవేత్త కోదండరాం మాట్లాడుతూ వర్గీకరణ పద్ధతుల ప్రావీణ్యం గ్రంథాలయ రంగానికి అత్యవసరమని, ఈ గ్రంథం విద్యార్థులు, గ్రంథపాలకులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించబడిందని ప్రశంసించారు. రచయిత రాజు మాట్లాడుతూ ఆధునిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మాన్యువల్‌ను సంక్షిప్తంగా, సరళమైన భాషలో రూపొందించామని తెలిపారు. గ్రంథాన్ని విశ్వమోహన్ సమీక్షించి దాని ప్రయోజనాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు అధ్యక్షత వహించగా, కార్యదర్శి రవికుమార్ చేగోని నిర్వహించారు. సాహిత్య, గ్రంథాలయ రంగానికి చెందిన పలువురు ఆచార్యులు, పండితులు, విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# ఇండోపాక్ సమరాన్ని ఆపా

## - నెతన్యాహూతో పేర్కొన్న ట్రంప్



**న్యూయార్క్ డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇండోపాక్ వార్‌ను ఆపినట్లు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూతో జరిగిన మీటింగ్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఫ్లోరిడాలోని మార్ ఏ లాగో పామ్‌బీచ్‌లో ట్రంప్‌తో నెతన్యూ భేటీ అయ్యారు. రెండోసారి వైట్‌హౌజ్‌లోకి ప్రవేశించిన తర్వాత ఇప్పటి వరకు 8 యుద్ధాలను నివారించినట్లు ట్రంప్ తెలిపారు. ఆర్మేనియా, అజర్‌బైజాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని, టారిఫ్‌లతో ఆ రెండు దేశాలను బెదిరించినట్లు చెప్పారు. కానీ తనకు అనుకున్నంత క్రెడిట్ దక్కలేదన్నారు. ఇండియా, పాకిస్థాన్ మధ్య ఫైటింగ్‌ను కూడా ఆపినట్లు ట్రంప్ వెల్లడించారు. అజర్‌బైజాన్ యుద్ధాన్ని ఆపిన తీరు పట్ల పుతిన్ కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు ట్రంప్ చెప్పారు. వాణిజ్యాన్ని నిలిపివేస్తానని అజర్‌బైజాన్‌ను బెదిరించామని, 200 శాతం టారిఫ్ విధిస్తామని చెప్పామన్నారు. దీంతో 35 ఏళ్ల ఫైటింగ్‌కు ఆ దేశం ఫుల్‌స్టాప్ పెట్టిందన్నారు. ఆ పని చేసినందుకు నాకేమీ క్రెడిట్ దక్కలేదని, అలాగే 8 యుద్ధాలను ఆపానన్నారు. ఇండియా, పాక్ వార్‌ను కూడా ఆపినట్లు ట్రంప్ చెప్పారు. ఇండోపాక్ సంక్షోభ అంశంపై ఇప్పటి వరకు సుమారు 70 సార్లు ట్రంప్ స్పందించినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్ తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు.

# షాద్ నగర్ పోలీసు శాఖ పునర్వ్యవస్థీకరణ

-ఇకపై షాద్ నగర్ కు డీసీపీ అధికారి ఏర్పాటు
-షాద్ నగర్ డిసిపి జోన్ పరిధిలో 9 మండలాలు
- షాద్ నగర్, ఆమనగల్ ప్రాంతాలకు వేరువేరుగా ఇద్దరు ఏసీపీలు
-షాద్ నగర్ ఏసిపి పరిధిలో చౌదరి గూడెం, కొందుర్గు, కొత్తూరు, నందిగామ, షాద్ నగర్
-మనగల్ ఏసిపి పరిధిలో అమన్ గల్, కేశంపేట, మాడుగుల, తలకొండపల్లి
-ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి షాద్ నగర్ నియోజకవర్గం
-ప్రజలకు మెరుగైన సేవలు - షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరణ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో నూతనంగా ఏర్పాటుచేసిన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి షాద్ నగర్ చేరింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గెజిట్ లో షాద్ నగర్, ఆమన్ గల్ లను కలిపి ఒక డిసిపి జోన్ గా ఏర్పాటు చేశారు.
ఇందులో షాద్ నగర్ డిసిపి జోన్ హెడ్ క్వార్టర్ కార్యాలయంగా ఉండడం విశేషం. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ కోసం కొత్త కమిషనరేట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు షాద్ నగర్ కు డిసిపి అధికారి కొత్తగా నియామకము జరుగుతుంది. షాద్ నగర్ డిసిపి జోన్ పరిధిలో మొత్తం తొమ్మిది మండలాలు చేరాయి. ఇందులో షాద్ నగర్ ఏసిపి పరిధిలో చౌదరి గూడెం, కొందుర్గు, కొత్తూరు, నందిగామ, షాద్ నగర్ ప్రాంతాలు ఉండగా ఆమనగల్ ఏసిపి పరిధిలో ఆమనగల్, కేశంపేట, మాడుగుల, తలకొండపల్లి మండలాలు ఉన్నాయి. అయితే నియోజకవర్గంలోని కేశంపేట మండలం ఆమన్ గల్ ఏసిపి పరిధికి వెళుతుంది. మిగతా పోలీస్ స్టేషన్లను షాద్ నగర్ ఏసిపి పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వం ఈ నూతన నిర్ణయం తీసుకోవడంతో గతంలో నందిగామ, కొత్తూరు మండలాలకు శంషాబాద్ ఏసిపి పరిధి నుండి విముక్తి లభించినట్టు అయింది.

**ప్రజలకు మెరుగైన సేవలు - షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలకు శాంతిభద్రతలలో మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీతో ఈ ప్రాంతాన్ని అనుసంధానం చేయడం ఆసక్తికర పరిణామం అని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గతంలో నందిగామ కొత్తూరు ఈ నియోజకవర్గం నుండి వేరుగా శంషాబాద్ ఎసిపి పార్థికి వచ్చేవని ఇప్పుడు షాద్ నగర్ హెడ్ క్వార్టర్ గా డిసిపి అధికారి కార్యాలయం మనవద్దని ఏర్పాటు కావడం సంతోషించదగ్గ పరిణామం ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు శాంతి పద్ధతుల పరిరక్షణ నేర నియంత్రణలో భాగంగా పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరణ చేసిన ప్రభుత్వం భవిష్యత్తులో ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం విశేషమని చెప్పారు. అదేవిధంగా డిసిపి జోన్ గా ఈ ప్రాంతాన్ని ఏర్పాటు చేసే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డిని తాను కలిసినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎస్పి రంక్ అధికారి షాద్ నగర్ కేంద్రంగా ఉండడం శుభపరిణామం శాంతిభద్రతల విషయంలో మెరుగైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేశంపేట మండలం ఏసిపి పరిధి ఆమన్ గల్ ఏర్పాటు కావడంతో తిరిగి ఆ మండలాన్ని ఇక్కడ చర్చేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు..

# ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

## - ఏడుగురు మృతి



**ఉత్తరాఖండ్ డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఉత్తరాఖండ్‌లో మంగళవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. బస్సు అదుపుతప్పి లోయలోపడిపోవడంతో ఏడుగురు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఈరోజు తెల్లవారుజామున అల్మోరా జిల్లాలోని శిలాపానీ ప్రాంతంలో ప్రయాణికులతో వెళుతున్న బస్సు ప్రమాదవశాత్తూ అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలోలో ఏడుగురు మృతి చెందగా.. మరో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అయితే ప్రమాదం జరిగిన లోయ ప్రదేశం ఇబ్బందికరంగా ఉండడం, వాహనం కింద బురద పేరుకుపోవడంతో అందులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీయడం కష్టంగా మారిందని అధికారులు తెలిపారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. బస్సు ద్వారహత్ మీదుగా రాంనగర్‌కు వెళుతుండగా అదుపుతప్పి లోయలో పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు. రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# 100 పడకల ఆసుపత్రి పై ఆగ్రవర్ణాల కుట్ర

## ఎఎంసి ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య



**వర్ధన్నపేట, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
వర్ధన్నపేట నియోజకవర్గానికి వంద పడకల ఆసుపత్రిని దళిత ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు మంజూరు చేపిస్తే 100 పడకల ఆసుపత్రి పై ఆగ్రవర్ణ నాయకులు కుట్రలు చేస్తున్నారని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.గత ఎమ్మెల్యే అరూరి రమేష్ 100 పడకల ఆసుపత్రి మంజూరు చేస్తానని ఎన్నో సార్లు పలు సభ వేదికల మీద హామీ ఇచ్చారు.కానీ గత ఆ ప్రభుత్వం మంజూరు చేయలేదు.అది హామీల వరకే పరిమితమైంది. వర్ధన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇంచార్జీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా మంత్రులు దనసరి సీతక్క,కొండ సురేఖ సహకారం తో వర్ధన్నపేట నియోజక వర్గానికి 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ మరియు 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్ మంజూరు చేయించి మూడు మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండలంలోని కట్రియాల గ్రామ రెవెన్యూ పరిధిలోని ఉప్పరపల్లి కి వెళ్లే దారిలోని ప్రభుత్వ భూమిలో ఇటీవల జిల్లా కలెక్టర్ తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగింది. అయితే కొందరు ఆగ్రా వర్ణాల నాయకులు,దళితుడైన ఎమ్మెల్యే నాగరాజుకు ఎక్కడ మంచి పేరు వస్తుందో అనే దురుద్దేశంతో వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో 100 పడకల ఆసుపత్రికి అనుకూలమైన స్థలం లేనప్పటికీ మున్సిపాలిటీ పరిధిలోని యువతను,అన్ని పార్టీలలో ఉన్న రాజకీయ నాయకులను కొందరు దొరలు వెనుక ఉండి ఊసీ కోల్పోతున్నారు.నాలుగు పర్యాలుగా ఆగ్రా వర్ణాలు పాలించిన వర్ధన్నపేట లో ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. ఈ రెండు సంవత్సరాల కాలంలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో గెలుపొంది. వర్ధన్నపేటను అన్ని రంగాలలో అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళ్తుంటే కే.ఆర్.నాగరాజు కు నియోజక వర్గ ప్రజల నుండి ఎక్కడ మంచి పేరు వస్తుందో,ఆదరణ పెరుగుతుందో అనుకోని బయపడి ఎదురుగా ఎమ్మెల్యే నాగరాజు ను ఢీకొనలేక దొరలు వెనుక నుంచి కుట్ర పూరితమైన ,విషరాజకీయలు చేస్తూ కట్రియాల శివారు అయిన ఉప్పరపెల్లి ఎక్స్ రోడ్డు పరిధిలో భూమి పూజ చేసిన ఆసుపత్రిని ,వర్ధన్నపేట కేంద్రానికి తరలించాలని ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఎందుకంటే దొరల ప్రాతినిధ్యం కోల్పోతామన్న భయంతో దళిత ఎమ్మెల్యే నాగరాజు పై ఇలాంటి దుష్ప్రచారా లకు తేరలేపుతున్నారు.ఇప్పటికైనా భేషజాలకు పోకుండా వంద పడకల ఆసుపత్రికి భూమిపూజ అయి ఉన్నది కాబట్టి ఆగ్ర వర్ణాలు,పెత్తందారులు ఎమ్మెల్యే నాగరాజు కి సహకరించాలని కోరుతున్నానాన్నారు...

# బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్‌ను తొలగించండి

## రక్షణ శాఖకు సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ ఆదేశం



**న్యూఢిల్లీ,డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్, సీఈవో జైతీర్థ ఆర్ జోషిని ఆ పదవి నుంచి తొలగించాలని సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ (సీఏటీ) ఆదేశించింది. అంతేకాకుండా ఈ పదవికి సీనియర్ సైంటిస్ట్ శివరామ సుబ్రహ్మణ్యం నంబీ నాయుడు పేరును పునః పరిశీలించాలని ఆదేశాలిచ్చింది. సీఈవోగా జోషి నియామకంలో విధానపరమైన లోపాలున్నాయని ఆరోపిస్తూ, ఆయన నియామకాన్ని నాయుడు క్యాట్‌లో సవాల్ చేశారు.దీనిని విచారించిన ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో రక్షణ శాఖ, డీఆర్‌డీవోలు నాయుడు అభ్యర్థనను నాలుగు వారాల్లోగా పరిశీలించాలని పేర్కొంది. ప్రస్తుత డైరెక్టర్ జనరల్ ఆ పదవిలో కొనసాగడాన్ని నిషేధిస్తూ తదుపరి సీఈవో నియామకం వరకు ప్రస్తుత సీఈవో స్థానంలో ఇన్‌చార్జిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది.

# జర్మనీలో భారీ బ్యాంక్ దోపిడీ

## బ్యాంకుకు కన్నం వేసి.. 315 కోట్లు కాజేసి..!



**బెర్లిన్ : డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
జర్మనీలోని ఒక సేవింగ్స్ బ్యాంక్ ఖజానాకు దొంగలు కన్నం వేసి భారీ దోపిడీకి పాల్పడ్డారు. చోరులు సుమారు రూ.315 కోట్ల (35 మిలియన్ డాలర్లు) విలువైన నగదు, బంగారం, ఆభరణాలు అపహరించినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. గెల్సెన్‌కిర్చెన్ నగరంలోని స్పార్కాస్ బ్రాంచ్‌లో జరిగిన ఈ దోపిడీలో దొంగలు మూడు వేలకు పైగా సేఫ్ డిపాజిట్ బాక్స్‌లను బద్దలు కొట్టారు.నిందితులు పక్కనే ఉన్న గ్యారేజ్ నుంచి కన్నం వేసి నగదున్న వాల్ట్‌లోకి ప్రవేశించారు. వీకెండ్ కారణంగా శనివారం రాత్రే బ్యాంక్‌లోకి ప్రవేశించి అందులోని బాక్స్‌లను తాపీగా బద్దలు కొట్టి ఉంటారని భావిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున అలారం మోగడంతో అప్రమత్తమైన పోలీసులు బ్యాంకుకు చేరుకునే సరికి పెద్ద కన్నంతో ఉన్న వాల్ట్ వారిని వెక్కిరించడంతో హతాశులయ్యారు.

# నేడు దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల సమ్మె..

## న్యూ ఇయర్ వేడుకలపై ప్రభావం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన గిగ్ వర్కర్లు డిసెంబర్ 31న దేశవ్యాప్తంగా సమ్మె తలపెట్టడంతో దేశంలో నూతన సంవత్సర వేడుకలకు భారీ అవరోధం ఏర్పడే అవకాశం ఉంది. రిటైల్ మార్కెట్లు అంచనా వేసుకున్న ఏడాది ముగింపు రెవెన్యూ టార్గెట్లపై గిగ్ వర్కర్ల సమ్మె తీవ్ర ప్రభావం చూపనున్నది. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ సమ్మెకు పిలుపునివ్వగా మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు వ్యాప్తంగా మద్దతు లభించింది.భారతదేశ డిజిటల్ కామర్స్ వ్యవస్థకు వెన్నెముకగా అభివర్ణించే డెలివరీ పార్ట్‌నర్లకు స్వల్ప ఆదాయానికి, తక్కువ భద్రత, గౌరవం, ఉద్యోగ భద్రతతో పనిచేయాల్సి వస్తోందని సంబంధిత యూనియన్లు వాపోతున్నాయి. గిగ్ వర్కర్ల సమ్మె కారణంగా హైదరాబాద్, బెంగళూరు, పుణె, ఢిల్లీ, కోల్‌కతా, పలు టైర్-2 మార్కెట్లలో కస్టమర్లకు ఫుడ్ ఆర్డర్లు, నిత్యావసర వస్తువుల డెలివరీల ఆర్డర్లు క్యాన్సిల్ కావడం లేదా తీవ్ర జాప్యం జరిగే అవకాశం ఉంది.

# పొగమంచుతో ఢీ కొన్న వాహనాలు..

## పలువురికి గాయాలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఉత్తరాది రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. దేశ రాజధాని ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాలను దట్టమైన పొగకమ్మేసింది . దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. ఈ పొగమంచు కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా హర్యానా లో రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రమైన పొగమంచు పరిస్థితుల కారణంగా దృశ్యమానత పడిపోయింది. దీంతో అతిసమీపంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించడం లేదు. ఈ కారణంగా సోనిపట్ జిల్లాలోని బహల్‌గఢ్ సమీపంలో ఢిల్లీ-సోనిపట్ రహదారిపై ఉదయం పలు వాహనాలు ఢీ కొన్నాయి . ఈ ప్రమాదంలో పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. మరోవైపు వాహనాలు ఢీ కొనడంతో ఆ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా రహదారిపై ఢీకొన్న వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కాగా, పొగమంచు కారణంగా గత కొన్ని రోజులుగా ఉత్తరాది రాష్ట్రాల్లో వాహనాలు ప్రమాదానికి గురవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాహనదారులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పొగమంచు పరిస్థితుల కారణంగా విజిబిలిటీ సరిగా లేదని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.